

న్యూస్ బాక్స్

వివరాలు పక్కాగా నమోదు చేయాలి

పెద్దపల్లి రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర ఇంటింటి సర్వే డేటా వివరాలను ఆన్‌లైన్‌లో కట్టుదిట్టంగా నమోదు చేయాలని డీఎల్‌పీవో వేణుగోపాల్ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయాల సమూహంలో టాస్క్ భవనంలో పెద్దపల్లి మండలానికి సంబంధించిన వివరాల నమోదును ఎంపీడీవో శ్రీనివాస్‌తో కలిసి డీఎల్‌పీవో పరిశీలించారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

నేడు ఖనిలో సదర్ ఉత్సవాలు

కళ్యాణ్‌నగర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): యాదవుల పండుగ అయిన సదర్ ఉత్సవాలను ఆదివారం సాయంత్రం గోదావరిఖని చౌరస్తాలో నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ నిర్వాహకులు మేకల శ్రీధర్, మేకల సమ్మయ్య తెలిపారు. శనివారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ విలేకరుల సమావేశంలో అంబటి నరేష్, గుండబోయిన ఓదెలు, భూమయ్య, గోపాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రధాన ఆసుపత్రిలో అరుదైన ఆపరేషన్

పెద్దపల్లిటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రధాన ఆసుపత్రి డాక్టర్లు 96 ఏళ్ల వృద్ధురాలికి తొంటిఎముక ఆపరేషన్ చేశారు. చిన్నకల్వలకు చెందిన పూదిరాల బాలమ్మ(96) ఇంట్లో కాలు జారిపడగా తొంటిఎముక విరిగింది. కుటుంబ సభ్యులు ఈనెల 21 ప్రభుత్వాస్పత్రిలో చేర్పించగా శనివారం డాక్టర్లు వృద్ధురాలికి ఆపరేషన్ చేసి ఎముకను అతికించారు. ఆపరేషన్‌లో పాల్గొన్న డాక్టర్లు శ్రీధర్, శ్రీనివాస్‌రెడ్డి, సౌరయ్య, కలెక్టర్ శ్రీకోయ హర్ష ప్రత్యేకంగా అభినందించారు.

పత్తిపాక రిజర్వాయర్‌కు మోక్షం..

- నేడు స్థల పరిశీలన చేయనున్న మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు
- ఉమ్మడి జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టుల పూర్తిచేస్తామని ఉత్తమ్ హామీ
- పది రోజుల్లో ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశం
- త్వరలో డీపీఆర్ సిద్ధం చేయనున్న అధికారులు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటిని జిల్లాకు అందించేందుకు ఎప్పటినుంచో ప్రతిపాదనలో ఉన్న పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణానికి మోక్షం లభించనున్నది. ఆదివారం జిల్లాకు చెందిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు చింతకుంట విజయరమణారావు, రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్, నీటి పారుదల శాఖాధికారులతో కలిసి ధర్మారం మండలం పత్తిపాక సందర్శించనున్నారు. ప్రతిపాదిత నిర్మాణ ప్రాజెక్టు స్థలాన్ని పరిశీలించనున్నారు. ఈనెల 20న, వేములవాడలో జరిగిన ప్రజాపాలన విజయోత్సవ సభకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జీ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పలువురు మంత్రులు హాజరైన విషయం తెలిసిందే. ఉమ్మడి జిల్లాలో పెండింగులో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పనులతో పాటు పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణం చేపడతామని కూడా ప్రకటించారు. వారం, పది రోజుల్లో ఉమ్మడి జిల్లాలో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించి సాగునీటి ప్రాజెక్టుల గురించి చర్చిస్తామన్నారు. ఈ సందర్భంగా పత్తిపాక రిజర్వాయర్ గురించి కూడా చర్చించే అవకాశాలున్నాయి. ఆ సమావేశానికంటే ముందే ప్రతిపాదిత పత్తిపాక రిజర్వాయర్ స్థలాన్ని పరిశీలించనున్నారు. ఎంత సామర్థ్యంతో రిజర్వాయర్‌ను నిర్మించాలి, ఎన్ని ఎకరాల భూములు ముంపునకు గురికానున్నాయి, ఇందులో ప్రభుత్వ భూములు ఎన్ని, పట్టా భూములు ఎన్ని, తదితర అంశాలపై చర్చించనున్నారు. అయితే ఈ ప్రాజెక్టుకు సంబంధించి నీటి పారుదల శాఖాధికారులు ప్రాథమికంగా ప్రతిపాదనలు రూపొందించారు. 7.78 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్‌ను నిర్మిస్తే, 1,700 ఎకరాల భూములు ముంపునకు గురికానున్నాయని ఒక అంచనాకు వచ్చారు. ఇందులో 400 ఎకరాల అటవీశాఖ భూములు కాగా, 1300 ఎకరాల పట్టా భూమిని సేకరించాల్సి ఉంటుంది. ఈ రిజర్వాయర్ నిర్మాణం పూర్తయితే జిల్లా రైతుల చిరకాల వాంఛ నెరవేరనున్నది.



పత్తిపాక రిజర్వాయర్ గురించి అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు(ఫైల్)

ప్రభుత్వం సానుకూలం..

ఆరు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తాను గెలిస్తే పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణం చేపట్టి రైతుల చిరకాల వాంఛను నెరవేరుస్తానని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు హామీ ఇచ్చారు. అలాగే రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సైతం పత్తిపాక నిర్మాణం చేపట్టాల్సిందేనని పట్టుబడుతున్నారు. ఈ మేరకు 3 మాసాల క్రితం మంత్రి శ్రీధరాబాబుతో కలిసి ఎమ్మెల్యేలు విజయరమణారావు, రాజాకూర్ మక్కాన్‌సింగ్ కలిసి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తదితరులకు విన్నవించారు. పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణంపై ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసింది. దీనిపై సంబంధిత నీటి పారుదల శాఖాధికారులతో ఎమ్మెల్యే విజయరమణారావు చర్చించారు. దీకొండ వద్ద గల పైప్ లైన్ నుంచి రిజర్వాయర్‌లోకి నీటిని సరఫరా చేసుకుని, అక్కడి నుంచి ఎస్సారెస్పీ డి- 83, 86 కాలువలకు గ్రావిటీ ద్వారా నీటిని సరఫరా చేయవచ్చని అధికారులు చెబుతున్నారు. ఈ రిజర్వాయర్ నిర్మాణం పూర్తయితే, ఒక్క జిల్లాలోగల లక్షా 80 వేల ఎకరాల ఆయకట్టుతో పాటు జగిత్యాల జిల్లా వెల్గటూర్, కరీంనగర్ జిల్లా కరీంనగర్, చొప్పదండి నియోజకవర్గాల్లోని మరో 50 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరగనున్నది. త్వరితగతిన రిజర్వాయర్ డీపీఆర్ రూపొందించి నిధులు మంజూరు చేయాలని ఈ ప్రాంత రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

● ప్రతిపాదనలకే పరిమితం..

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వారా జిల్లాలోని లక్షా 80 వేల ఎకరాల భూములకు సాగునీరు అందుతున్నది. ఎస్సారెస్పీ నీటిని వారబంధి పద్ధతిన పంటలకు

మిగతా 8వ పేజీలో...

జిల్లా కోర్టు భవన నిర్మాణానికి రూ. 81కోట్లు మంజూరు

- సీఎం, మంత్రులకు ఎమ్మెల్యే విజయరమణారావు కృతజ్ఞతలు

పెద్దపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టు భవన సముదాయ నిర్మాణానికి ప్రభుత్వం 81 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. 10 ప్లస్ 2 కోర్టు కాంప్లెక్స్‌తో పాటు ఫ్యామిలీ కోర్టు, పోక్సో కోర్టు భవనాలను కూడా నిర్మించనున్నారని పేర్కొన్నారు. పెద్దపెల్లి జిల్లా ఏర్పడిన తర్వాత కొద్ది రోజులకు జిల్లా కోర్టు మంజూరయ్యింది. ఆ కోర్టు ప్రస్తుతం పాత కోర్టు భవనంలో కొనసాగుతున్నది. గత ప్రభుత్వ హయాంలో నూతన కోర్టు భవన సముదాయానికి ధర్మారం ఎక్స్‌రోడ్డులో స్థల సేకరణ చేశారు. అది జిల్లా కేంద్రానికి చాలా దూరంగా ఉండడంతో అక్కడ కోర్టు భవనాన్ని నిర్మించవద్దని న్యాయవాదులు ప్రభుత్వానికి విన్నవించడంతో పాటు, అప్పటి ప్రజాప్రతినిధులకు, ప్రతిపక్షంలో ఉన్న విజయరమణారావుకు సైతం వినతిపత్రాలు అందజేశారు. ఎన్నికల సందర్భంగా అందరికీ అనువైన చోట కోర్టు భవన నిర్మాణానికి నిధులు మంజూరుచేయిస్తానని విజయరమణారావు హామీ ఇచ్చారు. తాను గెలిచిన తర్వాత భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రికి, పలువురు మంత్రులకు విన్నవించారు. ఆ మేరకు ప్రభుత్వం శనివారం 81 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయమై పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు కోర్టు భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రి శ్రీధర్‌బాబుకు, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పరిశ్రమల పరిధిలో ప్రజలకు వసతులు కల్పించాలి

పెద్దపల్లి, నవంబర్ 23 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల పరిధిలోగల గ్రామాలు, మున్సిపల్ ఏరియాల్లో కనీస వసతుల కల్పన బాధ్యతగా స్వీకరించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. శనివారం కలెక్టర్ కోయ శ్రీహర్ష కలెక్టరేట్ పరిధిలో ఎన్టీపీసీ, సింగరేణి, ఆర్ఎఫ్‌సీఎల్, కేశోరాం సిమెంట్ ప్రతినిధులతో కన్వర్జెన్స్ సమావేశం స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ జే అరుణశ్రీతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జిల్లాలో ఎన్టీపీసీ సింగరేణి, కేశోరాం సిమెంట్, ఆర్ఎఫ్‌సీఎల్ పరిశ్రమల పరిధిలో ఉన్న గ్రామాలలో పారిశుధ్యం, తాగునీటి సరఫరా, స్ట్రీట్ లైట్స్ మొదలగు అంశాల బాధ్యతను సదరు పరిశ్రమలు చేపట్టాల్సి ఉంటుందని కలెక్టర్ ఆదేశించారు. రామగిరి మండలం సెంటినరీ కాలనీలో తాగునీటి సరఫరా పనులకు ప్రతిపాదనలు తయారు చేసి సమర్పించాలని కలెక్టర్ ఈఈ మిషన్ భగీరథ గ్రిడ్‌ను ఆదేశించారు. ఈ సమావేశంలో డీపీవో వీర బుచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

బోనస్ సొమ్ము రైతుల ఖాతాల్లో జమ

- అదనపు కలెక్టర్ డి.వేణు

పెద్దపల్లిటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సన్న రకం వడ్లకు బోనస్ కింద ఇప్పటివరకు 8కోట్ల 46లక్షల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు అదనపు కలెక్టర్ డి.వేణు తెలిపారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లో పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 329 ధాన్యం కొనుగోలు ప్రతిపాదించి, 320 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని, ఇప్పటివరకు 268కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు ప్రారంభమైందన్నారు. రామగుండం, మంథని మొదలగు ప్రాంతాల్లో కోతలు ఆలస్యంగా జరుగుతాయని, అక్కడ మినహా ప్రతి చోట ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభమైందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 12 వేల 829 మంది రైతుల నుంచి 189 కోట్ల 15 లక్షల రూపాయల విలువ గల 81 వేల 537.94 మెట్రిక్ టన్నుల (దొడ్డు రకం 31 వేల701, సన్న రకం 49 వేల 836) కొనుగోలు చేసి ట్యాబ్ ఎంట్రీ పూర్తిచేశామని, రైతులకు 80శాతం మేర అనగా 151 కోట్ల 20లక్షల రూపాయల ధాన్యం డబ్బులు వారి ఖాతాల్లో జమచేశామని తెలిపారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేత

పాలకుర్తి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కేశోరాం పర్మినెంటు కార్మికులకు మెరుగైన దీపావళి బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం నుంచి సమ్మె చేపట్టనున్నారు. శనివారం పర్మినెంటు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బయ్యపు మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో యూనియన్ కమిటీ సభ్యులు, కార్మికులు హెచ్ఆర్ మెనేజర్ ప్రార్థసారథిని కలిసి సమ్మె నోటీస్ అందించారు. ఈ సందర్భంగా మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికైనా కార్మికుల ఇబ్బందులను కంపెనీ ఉన్నతాధికారులకు స్థానిక అధికారులు వివరించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి దాడి మహేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ పర్శవేణి శ్రీనివాస్ యాదవ్, నాయకులు పోతుల ప్రసాద్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఏసీపీకి ప్రశంసా పత్రం

కోల్‌సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రామగుండం ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులుకు ప్రశంసాపత్రం లభించింది. శనివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో డీజీపీ జితేందర్ ఆయనకు ప్రశంసాపత్రం అందజేశారు. పరకాల సీఐగా పనిచేసిన సమయంలో గంజాయి సాగు చేస్తున్న నిందితునిపై కేసు నమోదు చేసి చార్జిషీట్ వేశారు. కేసు విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో దోషికి పదేళ్ల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధించారు. చార్జిషీట్ దాఖలు చేయడంతో పాటు నిందితునికి శిక్ష పడేలా ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు ఆయనకు ప్రశంసాపత్రం అందజేశారు.



ఏసీపీ నర్సింహులుకు ప్రశంసాపత్రం అందజేస్తున్న డీజీపీ జితేందర్

గుట్టపై హనుమాన్ విగ్రహానికి ఎమ్మెల్యే పూజలు

అంతర్గాం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రామగుండం పట్టణంలోని 22వ డివిజన్ ఏరియా గుట్టపై శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహం బయట పడగా శనివారం స్థానిక రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ దంపతులు గుట్టపై గల హనుమాన్ విగ్రహ ప్రదేశాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. రామునిగుండాల గుట్టపై హనుమాన్ దేవాలయం నిర్మాణం చేపడుతామని పేర్కొన్నారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో 108 అడుగుల హనుమాన్ విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. హనుమాన్ కృపతో రామగుండం నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో సిరిసంపదలతో వర్ధిల్లాలని కోరుకున్నానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మేయర్ బంగి అనిల్ కుమార్, కాంగ్రెస్ నాయకులు మహంకాళి స్వామి, ఇసంపల్లి అంజులు, ఎండీ ఆసిఫ్ పాల్గొన్నారు.

వరకట్న దురాచారాన్ని రూపు మాపండి

కోల్‌సిటీటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వరకట్న దురాచారాన్ని ప్రతి ఒక్కరూ రూపు మార్చాలని గోదావరిఖని అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం గోదావరిఖని గీతాంజలి హైస్కూల్‌లో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కరస్పాండెంట్ కంది రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సన్న ధాన్యానికి బోనస్‌తో అదనపు ప్రయోజనం

- రైస్ మిల్లర్లకు సంబంధం లేకుండా ట్రక్ షీట్ జనరేట్ చేయాలి - మంత్రి శ్రీధర్‌బాబు

పెద్దపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సన్న రకం ధాన్యానికి క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ఇస్తుండడంతో రైతులకు అదనపు ప్రయోజనం చేకూరుతుందని, రైస్ మిల్లర్లకు సంబంధం లేకుండా ట్రక్ షీట్ జనరేట్ చేయాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. శుక్రవారం రాత్రి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వ విప్ అడ్లూరు లక్ష్మణ్ కుమార్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ డి వేణుతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సన్న వడ్లకు క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ప్రకటించడంతో రైతులకు అధికంగా లాభం చేకూరుతుందని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాల ద్వారా ప్రతి రైతు ఎంత లబ్ధి పొందుతున్నాడు వివరాలతో గ్రామాలలో బోర్డులను ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. రైతులకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రాధాన్యతను సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని, 2 లక్షల రుణ మాఫీ, సన్న రకం వడ్లకు 500 రూపాయల బోనస్ పథకాల లబ్ధి పొందుతున్న రైతులతో వీడియోలు చేసి ప్రచారం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. సన్న రకం వడ్లకు బోనస్ పడుతుంది అనే అంశం రైతులకు తెలిసేలా చేయాలని, ప్రతి రోజు సన్న రకం వడ్ల బోనస్ ఎంత వస్తుందో ప్రచారం కల్పించాలని అన్నారు. మనం చేసే కష్టం క్షేత్ర స్థాయిలో అందరికీ తెలియజేయాలని మంత్రి పేర్కొన్నారు. రైస్ మిల్లర్లకు సంబంధం లేకుండా ట్రక్ షీట్ జనరేట్ అయ్యే విధంగా చూడాలని, రైతులకు ఎక్కడ కోతలు విధించడానికి వీలు లేదని మంత్రి తెలిపారు. రైతులను ఎట్టి పరిస్థితులలో దోపిడీకి గురి చేయడానికి ఆస్కారం ఇవ్వవద్దని మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కొనుగోలు చేసిన ధాన్యంలో దాదాపు ఇప్పటి వరకు 80 శాతం మేరకు ధాన్యం నగదు చెల్లించడాన్ని మంత్రి శ్రీధర్ బాబు అభినందించారు. జిల్లాలో 51 వేల 827 రైతులకు 372 కోట్ల 59 లక్షల రూపాయల రుణమాఫీ పూర్తి చేశామని అన్నారు. ఫ్యామిలీ గ్రూపింగ్, రేషన్ కార్డు వంటి సాంకేతిక కారణాలవల్ల రుణమాఫీ కానీ రైతులకు కూడా త్వరలో రుణమాఫీ అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ప్రస్తుత వానాకాలం 82 శాతం మేర సన్న రకం వడ్ల పంట వస్తుందన్నారు. రైతులకు సన్న రకం వడ్ల బోనస్ వల్ల అధికంగా లబ్ధి చేకూరుతుందన్నారు. పెద్దపల్లి జిల్లాలో తేమ శాతం వచ్చిన నాణ్యమైన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి 24 గంటల వ్యవధిలో రైస్ మిల్లులకు తరలించి ఓపీఎంఎస్ వెబ్ సైట్‌లలో నమోదు చేస్తున్నామని, ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు త్వరితగతిన చెల్లింపులు జరిగేలా చూస్తున్నామన్నారు. యూనియన్ బ్యాంకులో 3 వేల మంది రైతులకు సాంకేతిక కారణాల వల్ల రుణమాఫీ కాలేదని, ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని వెళ్ళామని అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆదిరెడ్డి, డీఎస్ఓ రాజేందర్, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

నాణ్యమైన ఆహారాన్ని పిల్లలకు అందించాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని రెసిడెన్షియల్ హాస్టల్స్‌లో చదువుతున్న పిల్లలకు నాణ్యమైన ఆహారం మాత్రమే అందించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో రెసిడెన్షియల్ హాస్టల్స్‌పై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం రెసిడెన్షియల్ హాస్టల్స్‌పై అందరి దృష్టి ఉందని, అక్కడ చిన్న సమస్య వచ్చినా పెద్దగా చూపించే ప్రయత్నాలు జరుగుతాయి కాబట్టి అధికారులు అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని ఆదేశించారు. ముత్తారంలో జరిగిన ఫుడ్‌పాయిజనింగ్ వంటి సంఘటనలు మరోసారి పునరావృతం కాకుండా చూడాలని తెలిపారు. పిల్లలకు అందించే ఆహారంపై జాగ్రత్తగా ఉండాలని అన్నారు. ప్రతి పూట వేడి ఆహారం మాత్రమే అందించాలని, నిల్వచేసిన ఆహారం అందించవద్దన్నారు. వాతావరణం మారుతున్న నేపథ్యంలో పిల్లల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. స్థానికంగా ఉన్న అధికారులతో పిల్లల ఆరోగ్యం ఎప్పటికప్పుడు పరీక్షిస్తూ ఉండాలని సూచించారు. ముత్తారంలో డంపింగ్‌యార్డు చెత్త కాలబెట్టడం వల్ల పాఠశాల విద్యార్థులకు అస్వస్థతకు గురయ్యారని, ఇటువంటి పరిస్థితులు వేరే ఏదైనా పాఠశాల దగ్గర ఉన్నాయో గమనించి నివారణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. హాస్టల్స్ టైమింగ్ కట్టుదిట్టంగా అనుసరించాలని తెలిపారు.

ఈ సమావేశంలో సంబంధిత బీసీ వెల్ఫేర్ అధికారి రంగారెడ్డి, జిల్లాలోని హాస్టల్ వార్డెన్స్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.





విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

గంగాధర, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు సిబ్బంది విధులకు ఆటంకం కలిగించడంతో పాటు దూషణలకు పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గంగాధర కేడీసీసీబీ బ్యాంకులో గంగాధర మండలం వెంకటయ్యపల్లికి చెందిన ఉప్పుగండ్ల కరుణాకర్‌రెడ్డి తన పట్టదారు పాసుపుస్తకం పెట్టి గతంలో రుణం తీసుకున్నాడు. శనివారం బ్యాంకుకు వెళ్లి తన పాసుపుస్తకం ఇవ్వమని బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ రాంచంద్రను అడిగాడు. రుణం చెల్లించకుండా పాసుపుస్తకం ఇవ్వరాదని రాంచంద్రం తెలుపగా సిబ్బం విధులకు ఆటంకం కలించాడు. దీనిపై బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ రాంచంద్రం ఫిర్యాదు మేరకు కరుణాకర్ రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రాఘవపేట పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

జగిత్యాల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మల్లాపూర్ మండలం రాఘవపేట గ్రామ పంచాయతీ కార్యదర్శి వినయ్‌ను కలెక్టర్ సత్యప్రసాద్ సస్పెండ్ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారని జిల్లా ఇన్‌చార్జి పంచాయతీ అధికారి రఘువరన్ తెలిపారు. గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద మంజూరు అయిన నిధులను అక్రమంగా డ్రా చేశారన్న వ్యవహారంలో పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయడం జరిగిందని స్పష్టం చేశారు.

మద్యం తాగి పట్టుబడిన ఐదుగురికి జైలు శిక్ష

వేములవాడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి పట్టుబడిన ఐదుగురికి న్యాయస్థానం జైలు శిక్ష విధించిందని వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఇటీవల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలలో 24 మంది మందు బాబులను పట్టుకొని శనివారం వేములవాడ జూనియర్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జ్యోతిర్మయి ఎదుట ప్రవేశపెట్టారు. వారిలో ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష, 1500 రూపాయల జరిమానా, ముగ్గురికి ఒక రోజు జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా, 19 మందికి 1500 రూపాయల చొప్పున జరిమానా విధించారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుడి అరెస్టు

ఇల్లంతకుంట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయించేందుకు వచ్చిన యువకడిని అరెస్టు చేసినట్లు సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి తెలిపారు. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం గుండారం గ్రామానికి చెందిన మహమ్మద్ అల్ఫాహాద్ అనే యువకుడు శనివారం ఇల్లంతకుంటలో గంజాయి అమ్మడానికి రాగా ముస్కానిపేట గ్రామసమీపంలో ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ పట్టుకున్నట్లు పేర్కొన్నారు. బెజ్జంకి చికెన్‌సెంటర్‌లో పనిచేసే అల్ఫాహాద్ గంజాయికి అలవాటు పడ్డాడు. గుర్తుతెలియని వ్యక్తుల వద్ద గంజాయిని కొనుగోలు చేసి ఇల్లంతకుంటలో అమ్మకానికి వచ్చాడని అతని వద్ద 110 గ్రాములు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది, గ్రామస్థులు

మెట్‌పల్లి రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగ్గసాగర్ గ్రామంలోని సారా గంగారెడ్డికి చెందిన ఇల్లు విద్యుత్ సర్క్యూట్‌తో దగ్ధం కావడంతో శనివారం ఇంటిలోని వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. గ్రామస్థులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని పెద్దచెరువు సమీపంలోని సార గంగారెడ్డి కుటుంబం వ్యవసాయం చేసుకుంటు జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం ఉదయం ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులు పొలం పనులకు వెళ్లారు. కొంతసమయం తర్వాత ఇంట్లో నుంచి దట్టమైన పొగలు రావడంతో గమనించిన చుట్టుపక్కల వారు కుటుంబసభ్యులతో పాటు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందజేశారు. అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పివేసేసరికి ఇంటిలోని వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. ప్రమాదంలో ఎనిమిది వేల నగదు, టీవీ, బట్టలు, ఫర్నీచర్ ఇంటిలోని విలువైన సామగ్రి అంతా మంటల్లో కాలిబూడిదయ్యాయి. సుమారు ఎనిమిది లక్షల రూపాయలకు పైగానే నష్టం వాటిల్లిందని బాధితుడు సారా గంగారెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు. జరిగిన నష్టాన్ని పరిశీలించి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు అధికారులను కోరాడు.

అంబేద్కర్ చౌరస్తాలో హోటల్ దగ్ధం

సిరిసిల్ల క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గ్రంథాలయం పక్కన షార్ట్ సర్క్యూట్‌తో శనివారం సాయంత్రం హోటల్ అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. సిరిసిల్ల పట్టణానికి చెందిన వడ్నాల కృష్ణవేణి టేలాలో హోటల్ నిర్వహిస్తోంది. కొంత కాలంగా హోటల్ తెరవడం లేదు. హోటల్‌లో షార్ట్‌సర్క్యూట్ సంభవించి మంటలు వ్యాపించి పూర్తిగా కాలిపోయింది. అగ్నిమాపక శాఖ అధికారులు మంటలను ఆర్పివేశారు. అప్పటికే పూర్తిగా కాలడంతో దాదాపు రూ. 80 వేల నష్టం వాటిల్లినట్లు ఫైర్‌మన్ మహిపాల్ తెలిపారు.

అదుపు తప్పిన లారీ.. త్రుటిలో తప్పిన ప్రమాదం

మెట్‌పల్లి రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లుల్ల గ్రామంలోని ప్రధాన రహదారిపై యూరియా లోడుతో వెళ్తున్న లారీ ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి మురికి కాలువలో దిగబడింది. శనివారం మెట్‌పల్లి నుంచి జగ్గసాగర్ వైపు యూరియా లోడుతో బయలుదేరింది. ఈ క్రమంలో వెల్లుల్ల గ్రామంలోని ప్రధానరహదారి మీదుగా వెళుతున్న యూరియా లారీ ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ప్రమాదవశాత్తు అదుపు పక్కన ఉన్న మురికికాలువలో దిగబడింది. గ్రామంలో వేగంతో ఎదురుగా వస్తున్న వాహనాన్ని చాకచక్యంగా లారీ డ్రైవర్ తప్పించడంతో పెనుప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. దీంతో రహదారిపై సుమారు రెండు గంటల వరకు ట్రాఫిక్ జామ్ అయింది. గ్రామంలోని రహదారి ఇరుకుగా ఉండడంతో పాటు ఇరుపక్కల అప్రోచ్ దెబ్బతినడంతో ఇలాంటి ప్రమాదాలు జరిగి ప్రాణాలుపోయిన సంఘటనలు ఉన్నాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ప్రమాదాలు జరగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఉత్సవ విగ్రహాలు..

అద్భుత కళాఖండాలు

- పూర్వీకుల కళను బతికిస్తూ ఉపాధి
- కుంభకోణం తర్వాత సిరిసిల్ల విగ్రహాలకు గుర్తింపు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

అబ్బురపరిచే ఎన్నో విగ్రహాలు వారి చేతిలో జీవం పోసుకుంటాయి. పూర్వీకుల నుంచి వచ్చిన కళను బతికిస్తూ ఉపాధి పొందుతున్నారు. దేవాలయాల్లోని ఉత్సవ విగ్రహాలను తయారు చేస్తూ ప్రత్యేకతను చాటుతున్నారు. తెలంగాణలో ఏ ప్రధాన దేవాలయానికి వెళ్లినా వీరు తయారు చేసిన విగ్రహాలు, ఉత్సవ విగ్రహాలు దర్శనమిస్తాయి.



విగ్రహాలను తయారు చేస్తున్న కళాకారుడు

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కంచర సామాజిక వర్గానికి చెందిన కుటుంబాల కళాకారులు లోహ కళాఖండాల తయారీలో తెలంగాణ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందారు. దాదాపు 300 ఏళ్ల క్రితం ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎలగందుల నుంచి అప్పటి సర్‌దేశాయిల ఆహ్వానం మేరకు 20 కుటుంబాలు సిరిసిల్లకు వచ్చాయి. లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో 300 ఏళ్ల క్రితం బ్రహ్మోత్సవాలకు కావాల్సిన శావకు సంబంధించి పరికరాలను తయారు చేశారు. ఆ కుటుంబాల్లో కొందరు వృత్తిని మానేసినా సిరిసిల్ల లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద ఇప్పటికీ గజ్జెల వెంకటనర్సయ్య కుటుంబం విగ్రహాల తయారీ చేస్తోంది. తండ్రి బాటలోనే అతడి తనయులు గణేష్, జగన్, మహేష్ అద్భుత కళాఖండాలను రూపొందిస్తున్నారు. వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం నుంచి మొదలుకుంటే తెలంగాణలో ప్రధానమైన అన్ని దేవాలయాల్లో వీరు తయారు చేసిన విగ్రహాలు ఉన్నాయి.



కుంభకోణం తర్వాత సిరిసిల్లలోనే మైనంతో తయారీ..

తెలంగాణలో వివిధ ప్రాంతాల్లో లోహ కళాఖండాలు తయారవుతున్నా సిరిసిల్లలోని పంచలోహ విగ్రహాలకు ప్రత్యేకత ఉంది. వీరి పూర్వీకులు తమిళనాడు రాష్ట్రం కుంభ కోణంలో మాత్రమే మైనంతో ముందుగా ఆకృతిని రూపొందించడం కనిపించేది. అలా విగ్రహాలను తయారు చేయడం వీరి ప్రత్యేకత. కుంభకోణం తర్వాత అదే ప్రత్యేకతను సిరిసిల్లలో కొనసాగిస్తున్నారు. మనం కోరుకున్న విగ్రహాన్ని ముందుగా మైనంతో తయారు చేసి పంచలోహం, వెండితో మోడలింగ్ చేస్తారు. ఆ తర్వాత ఫినిషింగ్ చేస్తారు.



కళను బతికించాలని తాపత్రయం

- గజ్జెల మహేష్, కళాకారుడు

యానిమేషన్ రంగంలో పనిచేశాను. చదువుకున్నా తరతరాలుగా వస్తున్న కళను బతికించుకోవాలనే తాపత్రయంతోనే కులవృత్తిని కొనసాగిస్తున్నాను. ముగ్గురు సోదరుల్లో ఒకరు యానిమేషన్ చిత్రాలను చేస్తారు. ఖాళీ సమయాల్లో పంచలోహ కళాఖండాలను తయారు చేస్తారు.

ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చి ప్రోత్సహించాలి

- గజ్జెల జగన్, కళాకారుడు

మా పూర్వీకుల నుంచి ఇదే కళను నమ్ముకొని కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. ఇప్పుడు యంత్రాలను ఉపయోగించుకుంటున్నాం. ఇందుకు కావాల్సిన ముడిసరుకు, రసాయనాలు సబ్సిడీలను ప్రభుత్వం ఇచ్చి ప్రోత్సహించాలి. వ్యాపారాల కోసం వడ్డీలేని రుణాలను అందించాలి.



ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి పోలీసుల నోటీసులు?

హుజూరాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి రెండు రోజుల క్రితం పోలీసులు నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. ఈ నెల 9న దళితబంధు రెండో విడత డబ్బులు విడుదల చేయాలని ఎలాంటి అనుమతులు లేకుండా ధర్నా, రాస్తారోకో నిర్వహించి ప్రజలకు అసౌకర్యం కలిగించినందుకు 35 (3) బీఎన్ఎస్ కింద హుజూరాబాద్ ఎస్ఐ యూనస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డితో పాటు మరికొంత మంది బీఆర్ఎస్ ముఖ్య నాయకులకు నోటీసులు అందించినట్లు సమాచారం.

లైంగిక వేధింపులపై ఫిర్యాదు

జగిత్యాల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలోని ఓ ప్రభుత్వ సంస్థలో పనిచేస్తున్న ఓ మహిళ తోటి ఉద్యోగులు తనను లైంగికంగా వేధిస్తున్నారంటూ జిల్లా కలెక్టర్‌ను శనివారం ఆశ్రయించినట్లు సమాచారం. తాను పనిచేసే చోట తనను వేధించడంతో అందులో పనిచేసే ఉన్నత ఉద్యోగిని ఆశ్రయించి తనకు న్యాయం చేయాలని కోరానని, అందుకు నీకు వ్యక్తిగతంగా సహాయం చేస్తే నాకేం లాభం అంటూ అతను సైతం ఒంటరిగా తనను కలవమని అన్నాడని ఫిర్యాదులో పేర్కొన్నట్టు సమాచారం. వారి నుంచి కాపాడాలని కలెక్టరును ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిసింది.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

చొప్పదండి, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): రాగంపేట గ్రామ శివారులోని కాలువలో శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని గమనించిన లష్కర్ తమకు సమాచారాన్ని అందించాడని ఎస్సై అనూష తెలిపారు. మృతదేహం బాగా కుళ్లి న స్థితిలో ఉందని తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

సిరిసిల్ల క్రైం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణం పెద్దూరులోని బాబాజీనగర్‌కు చెందిన మొటం సాగర్(21) అనే యువకుడు చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. టౌన్ సీఐ కె. కృష్ణ వివరాల ప్రకారం... పెద్దూరు బస్టాండ్ వద్ద మూడేళ్ల క్రితం సాగర్ వెల్డింగ్ షాప్ నెలకొల్పాడు. గిరాకీ లేకపోవడంతో నష్టాల పాలయ్యాడు. దీంతో మనస్తాపం చెందిన సాగర్ ఈ నెల 11న గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. సాగర్ తండ్రి రాజారాం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు.

కుటుంబ వివాదాలతో ఒకరి ఆత్మహత్య

కోల్‌సిటీ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని చంద్రశేఖర్ నగర్ ఒరియా కాలనీలో నివాసముండే పాల్ మోహన్(40) అనే వ్యక్తి శనివారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కూలీ పని చేసుకునే మోహన్‌కు భార్య దీప, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ వివాదాలతో ఏడాదిగా భార్య పుట్టింట్లోనే ఉంటుంది. దీంతో మోహన్ మనోవేదనకు గురయ్యాడని, జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్టు మోహన్ సోదరుడు ధర్మేందర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు పేర్కొన్నారు.

గ్రానైట్ క్వారీ అనుమతులు రద్దు చేయాలి

- చాకలివానిపల్లి గ్రామస్థుల నిరసన

గన్నేరువరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చాకలివానిపల్లి గ్రామంలో పల్లిబండను గ్రానైట్ క్వారీ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులను ఇవ్వొద్దని ఇస్తే అడ్డుకుంటామని గ్రామస్థులు, రైతులు పల్లిబండ వద్ద శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామానికి అతి సమీపంలో ఉన్న పల్లిబండ రైతులకు ధాన్యం ఆరబోసుకోవడానికి ఉపయోగకరంగా ఉంటుందని, బండ పైన ఆలయంలో కొలువై ఉన్న దుర్గమ్మను గ్రామస్థులంతా పూజించుకుంటున్నామని అన్నారు. అన్ని రకాలుగా గ్రామస్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న పల్లిబండను గ్రానైట్ క్వారీగా మార్చి విధ్వంసం చేస్తే చాకలివానిపల్లి గ్రామం కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో గ్రానైట్ క్వారీకి అనుమతులు ఇవ్వద్దని పలుమార్లు తహశీల్దారుకు, ఆర్డీవోకు, మైనింగ్ అధికారులకు వినతిపత్రాలను అందజేసినట్లు తెలిపారు. అంతే కాకుండా ఇటీవల గ్రానైట్ క్వారీ అనుమతులపై ఆర్టీఐ చట్టం క్రింద దరఖాస్తు చేయగా అందులో 2017లో కరీంనగర్‌కు చెందిన ఓ వ్యక్తికి గ్రామంలోని సర్వే నం.402లోని ఒక హెక్టారు విస్తీర్ణం గల పల్లిబండను గ్రానైట్ తవ్వకాలకు ఎన్‌వోసి మంజూరు కొరకు మైనింగ్ శాఖకు సర్వే నివేదికను పంపినట్లు ఆర్టీఐలో పేర్కొన్నట్లు తెలిపారు. గతంలో చాకలివానిపల్లి గ్రామ పంచాయతీగా ఏర్పాటు కాకముందు రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారని,



చాకలివానిపల్లిలో నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

ప్రస్తుతం గ్రామపంచాయతీగా ఏర్పడ్డాక గత ఐదేళ్లుగా గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటుంటే గ్రామపంచాయతీ అనుమతులు లేకుండా గ్రానైట్ క్వారీ ఏర్పాటు కాబో తుందని తెలిసి గ్రామస్థులంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి గ్రానైట్ క్వారీ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బోయిని బాలయ్య, రేపాక బాబు, కూన యాదగిరి, చంద్రశేఖర్, బామండ్ల అనిల్, నక్క తిరుపతి అధిక సంఖ్యలో గ్రామస్థులు, రైతులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల రోడ్డు ప్రమాదాలు.. నలుగురి మృతి

ఉమ్మడి జిల్లా పరిధిలో వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

- రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో యువకుడి మృతి

సిరిసిల్ల టౌన్/గంభీరావుపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండలం రాజేశ్వర్‌రావునగర్ కాలనీకి చెందిన చల్ల రమేష్ (33) అనే యువకుడు శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం... చల్ల రమేష్ పొలం వద్దకు శుక్రవారం ఇంటి నుంచి బైక్‌పై వెళ్లాడు. రాత్రి 11 గంటల ప్రాంతంలో రమేష్ ఇంటికి తిరిగి వస్తున్నాడు. దుర్గమ్మ గుడి వద్ద సిరిసిల్ల వైపు నుంచి బిక్కనూరుకు చెందిన సందీప్ ద్విచక్ర వాహనంపై వస్తూ ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రమేష్‌కు తీవ్రంగా గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు రమేష్ భార్య రజిత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. కాగా రోడ్డు ప్రమాదానికి కారుకులను తమకు అప్పగించాలంటూ రమేష్ బంధువులు, గ్రామస్థులు శనివారం సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తా వద్ద రాస్తారోకో చేపట్టారు. సిరిసిల్ల పట్టణ సీఐ కృష్ణ న్యాయం జరిగేలా చూస్తామంటూ హామీనివ్వడంతో రాస్తారోకో విరమించారు.

- ధర్మారంలో వ్యాన్ ఢీకొని ఒకరు..



రాజేశం(ఫైల్)

ధర్మారం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ధర్మారం మండలం ఎర్రగుంటపల్లి బస్టాప్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో లంబాడి తండా (బి) గ్రామానికి చెందిన భూక్య రాజేశం(34) అనే వ్యక్తి మృతిచెందాడు. ఆదివారం రాజేశం తన పొలం కోయాల్సి ఉండగా, శనివారం ధర్మారం వచ్చి వ్యవసాయ పనిముట్లు కొనుగోలు చేశాడు. తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో ఎర్రగుంటపల్లి గ్రామ బస్టాండ్ వద్ద ఎదురుగా వస్తున్న డీసీఎం వ్యానును ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. . సంఘటన స్థలాన్ని ఎస్ఐ శీలం లక్ష్మణ్ పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

- ట్రాక్టర్ ట్రాలీ, బైక్ ఢీకొని ఒకరు..

వెల్గటూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి గ్రామ శివారులో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నల్లపు అవినాష్(19) అనే యువకుడు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్సై ఉమా సాగర్ తెలిపిన వివరాల ప్రకారం పెద్దపెల్లి జిల్లా పాలకుర్తి మండలం కుక్కలగూడూరు గ్రామానికి చెందిన నల్లపు అవినాష్(19) కుదిరే సాగర్(18), బడుగు సాగర్(19) అనే యువకులు పని నిమిత్తం ద్విచక్ర వాహనం పై రాయపట్నం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో కొత్తపల్లి గ్రామశివారులో ట్రాక్టర్ డ్రైవర్ ఎలాంటి సిగ్నల్ ఇవ్వకుండా అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ కుడివైపు ఆకస్మాత్తుగా తిప్పాడు. ముగ్గురు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం ట్రాక్టర్ ట్రాలీని వేగంగా ఢీకొట్టింది. ముగ్గురు కిందపడగా తీవ్ర గాయాల య్యాయి. నల్లపు అవినాష్ జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మిగిలిన ఇద్దరు కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎస్సై ఉమాసాగర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

- గుర్తు తెలియని బైక్ ఢీకొని..

కరీంనగర్ క్రైం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి శివారులో శుక్ర వారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దేశరాజ్‌పల్లికి చెందిన గజ్జెల రాజశేఖర్(27) మృతి చెందాడని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. రాజశే ఖర్ రాత్రి 10:30 గంటలకు బైక్‌పై కరీంనగర్ నుంచి దేశరాజ్‌పల్లికి వెళుతుండగా కొత్తపల్లి శివారులోని ఎస్సారెస్పీ కెనాల్ వద్ద ఎదురుగా వచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి భూకబ్జా

- ముగ్గురు నిందితుల అరెస్టు

కరీంనగర్ క్రైం, నవంబర్ 23(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రేకుర్తి శివారు, విద్యానగర్ ప్రాంతానికి చెందిన ఒక స్థలానికి నకిలీ ధృవపత్రాలు సృష్టించి ఆక్రమించిన కేసులో కరీంనగర్ రెండో ఠాణా పోలీసులు శనివారం ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారిలో ఒక డాక్టర్, బీఆర్ఎస్ నాయకులున్నారు. మరొకరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. రెండో ఠాణా సీఐ విజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ ఫతేనగర్‌కు చెందిన షేక్ అబుబాకర్ 1992లో రేకుర్తి శివారులోని సర్వే నెంబరు 79/2లోని 8.12 ఎకరాల భూమిని సాలెహ్ బి నుంచి కొనుగోలు చేసి 1996లో వెంచర్ చేసి ప్లాట్లను పలువురికి విక్రయించాడు. ఈ వెంచర్‌లోని ప్లాట్ నెంబరు 311లో 200 గజాల స్థలాన్ని గొర్ల లక్ష్మికి విక్రయించగా ఆమె ఆ స్థలాన్ని 2010లో మేడిశెట్టి లచ్చయ్యకు, 2011లో లచ్చయ్య తన అవసరాల కోసం గుర్రం బాలనరేందర్‌కు విక్రయించాడు. ప్లాట్‌నెంబరు 311 పక్కనే ఉన్న 312, 313లలోని 400 గజాల స్థలాన్ని వెంచర్ యజమాని అయిన షేక్ అబుబాకర్ ఎవరికి విక్రయించకుండా తనే ఉంచుకున్నాడు. ఈ 400 గజాల స్థలాన్ని కాజేయాలనే ఉద్దేశంతో పక్క ప్లాట్ యజమాని గుర్రం బాలనరేందర్, గుర్రం రాజయ్య, ఉప్పు శ్రీనివాస్, చీటి ఉపేందర్‌రావులు పథకం ప్రకారం రేకుర్తి గ్రామ పంచాయతీ కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసి తప్పుడు ఇంటి నెంబరు సృష్టించి దాని ద్వారా 2022లో గంగాధర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఆ తరువాత సప్లిమెంట్ డీడ్ ద్వారా 312, 313 ప్లాట్లను రిజిష్టర్ కార్యాలయంలో నమోదు చేయించి ఇందులో 312 ప్లాట్‌ను చీటి ఉపేందర్‌రావు పేరిట, 313 ప్లాట్‌ను ఉప్పు శ్రీనివాస్ పేరిట మోసపూరింతగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఆ స్థల యాజమిని అక్కడికి వెళితే బెదిరింపులకు పాల్పడుతున్నారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రెండో ఠాణా పోలీసులు లోతుగా విచారణ జరిపి నలుగురు నిందితులపై ఐపీసీ సెక్షన్ 420, 467, 468, 471, 120-బి, 506 రెడ్‌విత్ 34 కింద పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుల్లో విద్యానగర్ వెంకటేశ్వరకాలనీకి చెందిన గుర్రం బాల నరేం దర్(37), విద్యానగర్‌కు చెందిన ఉప్పు శ్రీనివాస్(47), మెహర్‌నగర్‌కు చెందిన చీటి ఉపేందర్‌రావు(38)లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. మరో నిందితుడు గుర్రం రాజయ్య పరారీలో ఉన్నాడని తెలిపారు.

సమస్యల వలయంలో సమీకృత హాస్టల్

- కాలం వెల్లదీస్తున్న విద్యార్థులు
- పట్టించుకోని జిల్లా అధికారులు

మానకొండూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్‌లోని వెనుకబడిన తరగతుల సమీకృత హాస్టల్ భవనం అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతుండడంతో ఏళ్లగా విద్యార్థులు కాలం వెల్లదీస్తున్నారు. సమస్యలపై అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి. గత 16 ఏళ్ల క్రితం మానకొండూర్‌లో వెనుకబడిన తరగతుల హాస్టల్ భవనాన్ని కోట్లాది రూపాయలతో నిర్మించారు. ఈ హాస్టల్‌లో 300 మంది విద్యార్థులకు సరిపడా అన్ని హంగులతో బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మించారు. ఈ హాస్టల్‌లో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులుండాలన్న నిబంధన ఉన్నప్పటికీ 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 148 మంది విద్యార్థులు ప్రస్తుతం ఉంటున్నారు. అంతేకాకుండా 18 మరుగుదొడ్లు, 18 స్నాన గదులు ఉన్నప్పటికీ అవి పూర్తిగా ధ్వంసం అయ్యాయి. ఫ్యాన్లు, స్విచ్ బోర్డ్సు, రెండు బోర్లలో ఒక్క బోరు చెడిపోయినా ఇప్పటికీ మరమ్మతు చేయలేదు. తాగునీటికి విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. చలి కాలంలో ప్రభుత్వం ఇప్పటికీ రగ్గులు పంపిణీ చేయకపోవడంతో విద్యార్థులు చలికి వణికిపోతున్నారు. సీసీ కెమెరాలు చెడిపోయి రోజులు గడిచినా మరమ్మతు లేదు. రాత్రి వేళల్లో దోమల బెడద ఎక్కువగా ఉంది. దోమల తెరను పంపిణీ చేయలేదు. హాస్టల్ భవనం నిర్మించినప్పటి నుంచి ఇప్పటి వరకు భవనానికి రంగులు వేయలేదు. రెండు గదులు వర్షానికి ఉరుస్తుండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పూర్తి స్థాయిలో సిబ్బంది లేకపోవడమే కాకుండా ఏఎన్ఎం, స్కావెంజర్ పోస్టులు అత్యవసరం ఉంది. కాస్మోటిక్ చార్జీలు ఒక్క విద్యార్థికి నెలకు రూ. 62లను సెప్టెంబరు వరకు చెల్లించినా ఇటీవల పెంచిన చార్జీలు వెంటనే అమలు చేయాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఇప్పటికైనా హాస్టల్‌లో సమస్యలను పరిష్కరించా లని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



మానకొండూర్‌లోని సమీకృత హాస్టల్ భవనం



సమీకృత హాస్టల్‌లో చెడిపోయిన మరుగుదొడ్ల తలుపులు

పోలీసుల మాబ్ ఆపరేషన్



మాబ్ ఆపరేషన్ నిర్వహిస్తున్న పోలీసులు

కోల్‌సిటీ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో శాంతి భద్రతల సమస్యలు వచ్చినప్పుడు అదుపులోకి తీసుకోవడంపై అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేసేందుకు శనివారం మాబ్ ఆపరేషన్ - మాక్ డ్రిల్ ప్రాక్టీస్ కార్యక్రమం నిర్వహించారు. బీఎన్ఎస్ఎస్ 163సెక్షన్(ఐపీసీ 144) అమలులో ఉన్నప్పుడు శాంతి భద్రతలకు విఘాతం కలిగే సందర్భంలో నియంత్రణలోకి తీసుకురావాలనే విషయాలపై ఏఆర్ ఏసీపీ సుందర్ వివరించారు. బాష్పవాయువు ప్రయోగం, వాటర్ కెనాన్‌లు, లాఠీ చార్జి, ప్లాస్టిక్ పెల్లెట్స్ ఫైరింగ్, అప్పటికీ శాంతి భద్రతలు అదుపులోకి రాకపోతే ఫైరింగ్ వంటివి ఆర్ఐ దామోదర్, మల్లేషం, సంపత్ వివరించారు. గోదావరిఖని, పెద్దపల్లి సివిల్ సిబ్బందితో ప్రాక్టీస్ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏసీపీ సుందర్‌రావు, గోదావరిఖని టుటౌన్ సీఐ ప్రసాద్‌రావు, ఆర్ఐ దామోదర్, మల్లేషం, సంపత్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

కస్టమ్స్ అధికారుల పేరుతో మహిళకు టోకరా

● రూ.21.8 లక్షలు ఖాతాకు జమ చేయించుకున్న సైబర్ నేరగాళ్లు

● భువనేశ్వర్‌లో నిందితుడి అరెస్టు

కరీంనగర్ క్రైం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తాము కస్టమ్స్ డిపార్ట్‌మెంట్ అధికారులమని ఒక మహిళకు సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి ఆమె పేరిట డ్రగ్స్ పార్సిల్ వచ్చిందని భయపెట్టి 21.8 లక్షల వారి బ్యాంక్ ఖాతాలో జమ చేయించుకున్నారు. ఈ కేసులో నిందితుడిని కరీంనగర్ సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేసి శనివారం కరీంనగర్ కోర్టులో హాజరుపరిచారు. కరీంనగర్ సైబర్ క్రైం డీఎస్పీ నర్సింహారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ కమాన్ ప్రాంతంలో నివసిస్తున్న ఒక మహిళకు జూన్ నెలలో ఒక ఫోన్ కాల్ వచ్చింది. తాము కస్టమ్స్ డిపార్ట్‌మెంట్ అధికారులమని మీ పేరిట డ్రగ్స్ పాస్‌పోర్ట్, చాలారకాల ఏటీఎం కార్డులు పార్సల్ వచ్చాయన్నారు. మీరు వెంటనే ఢిల్లీ పోలీసులతో మాట్లాడాలని ఫోన్ కాన్ఫరెన్స్ కలిపి మరో వ్యక్తితో మాట్లాడించారు. బాధితురాలు వారి మాటలను నమ్మి వారు చెప్పినటువంటి బ్యాంక్ ఖాతాకు రెండు విడతలుగా 21 లక్షల 80 వేల రూపాయలను పంపించారు. నేరస్తులకు డబ్బులు పంపించే సమయంలో మోసం చేస్తున్నారని గుర్తించలేకపోయానని, ఆ తర్వాత తాను మోసపోయానని గుర్తించి వెంటనే సైబర్ క్రైం హెల్ప్‌లైన్ సెంటర్ 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేశానన్నారు. ఈ మేరకు కరీంనగర్ సైబర్‌క్రైం పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా విధులు నిర్వహిస్తున్న డీఎస్పీ నర్సింహారెడ్డి వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణ ప్రారంభించారు. ఈ ఘటనలో ఒడిస్సా రాష్ట్రం భువనేశ్వర్‌లోని ఒక బ్యాంక్ ఖాతాలోకి బాధితురాలి డబ్బులు ట్రాన్స్‌ఫర్ అయినట్లుగా గుర్తించారు. డీఎస్పీ నర్సింహారెడ్డి ఆదేశాలతో సైబర్ క్రైం ఎస్ఐ వంశీకృష్ణ తన సిబ్బందితో కలిసి ఒడిస్సా రాష్ట్రంలోని భువనేశ్వర్ జిల్లాలో ఉన్న నిందితుడు సదాన్షు శేఖర్ మహంతిని పట్టుకున్నారు. శనివారం కరీంనగర్ తీసుకువచ్చి స్థానిక కోర్టులో హాజరుపరిచారు. నేరస్తుడిని విచారించగా భువనేశ్వర్‌లో వ్యాపారం చేస్తున్నట్లు తెలిపాడు. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో ఆర్వల్ అప్లియెన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట సదాన్షు శేఖర్ మహంతి, సర్వేశ్వర మహంతి పేరిట ఖాతా తెరిచారు. బాధితులను బెదిరించి ఈ ఖాతాకు డబ్బులను ట్రాన్స్‌ఫర్ చేయించుకునేవారని విచారణలో వెల్లడైంది. ఈ కేసులో మరో నిందితుడు అయిన సర్వేశ్వర మహంతి ప్రస్తుతం ఢిల్లీ పోలీసుల ఆధీనంలో ఉన్నాడు. నిందితులు ఇద్దరిపై ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, తమిళనాడు, బీహార్, హర్యానా, కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల్లో 24 వరకు కేసులు ఉన్నాయని కరీంనగర్ సైబర్ క్రైం డీఎస్పీ నర్సింహారెడ్డి తెలిపారు. ఈ కేసులో నేరస్థుడిని చాకచక్యంగా పట్టుకున్న సిబ్బందిని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ షికాగోయల్, కరీంనగర్ సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ డీఎస్పీ నర్సింహారెడ్డిలను అభినందించారు.

అధునాతన జైళ్లు నిర్మిస్తాం

● జైళ్లశాఖ ఐజీ ఎన్ మురళీబాబు



మాట్లాడుతున్న ఐజీ మురళీబాబు

కరీంనగర్ క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అధునాతన జైళ్లు నిర్మించి ఖైదీల రద్దీని తగ్గిస్తామని జైళ్లశాఖ ఐజీ మురళిబాబు తెలిపారు. జిల్లా జైలులో రెండో విడత పునశ్చరణ తరగుతులను శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మురళీబాబు మాట్లాడుతూ సిబ్బంది ఆరోగ్య సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. పెట్రోల్ బంక్‌లు, ఫ్యాక్టరీల్లో గణనీయమైన లాభాలను ఆర్జిస్తున్నామన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ జైలు పెట్రోల్ బంక్‌లలో పరిశుభ్రత, నాణ్యత బాగుందని ప్రశంసించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ కె వెంకటరమణ మాట్లాడుతూ సిబ్బంది అందరూ నిత్యజీవితంలో తీసుకోవలసిన ఆహార నియమాల గురించి వివరించారు. జైలు సూపరింటెండెంట్ కె శ్రీనివాస్ మాట్లాడుతూ జైళ్లశాఖ ప్రతిష్టను పెంపొందించే విధంగా కార్యక్రమాలు చేపటనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సైక్రియాటిస్ట్ డాక్టర్ ఎల్ వర్తి, కార్పొరేట్ ట్రైనర్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్ జక్కని రాజు. జైలు వైద్య అధికారి డాక్టర్ కె వేణుగోపాల్, జైలర్స్ పి శ్రీనివాస్, బి రమేష్, పరుశరామ్, డిప్యూటీ జైలర్స్ శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కరీంనగర్ క్రైం, నవంబర్ 23 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మార్క్‌ఫెడ్ మైదానం ప్రాంతంలో రోడ్డుపై శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో భగత్‌నగర్‌లో నివాసం ఉంటున్న వీణవంక మండలం ఎలబాక గ్రామానికి చెందిన కాసం రాఘవేందర్‌రెడ్డి(28) దుర్మరణం చెందాడని రెండో టౌన్ పోలీసులు తెలిపారు. కరీంనగర్ డెయిరీలో పనిచేస్తున్న రాఘవేందర్‌రెడ్డి విధులు ముగించుకుని శుక్రవారం సాయంత్రం ఇంటికి వెళ్లి మళ్లీ బయటకు వచ్చాడని మృతుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. రాత్రి 11 గంటల ప్రాంతంలో రాఘవేందర్‌రెడ్డి ఫోన్‌కు అతని భార్య కాల్ చేయగా ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది ఫోన్‌కాల్ రిసీవ్ చేసుకుని రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు తెలిపారని పేర్కొన్నారు. మార్క్‌ఫెడ్ గేట్ వద్ద యూ టర్న్ సమయంలో గుర్తుతెలియని వాహనం అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టగా తలకు ఇతర చోట్ల తీవ్రగాయాలతో మృతి చెందాడని పోలీసులు తెలిపారు.

లేనిది ఉన్నట్టు.. అంతా కనికట్టు

● అమ్మ స్ఫూర్తితో అంతర్జాతీయ స్థాయికి..

● సామాజికంగా అంశాలపై త్రీడీ చిత్రాలు

● కార్టూనిస్టుగా త్రీడీ ఆర్టిస్టుగా రాణిస్తున్న సింగారపు శివరామకృష్ణ



తాను సాధించిన రికార్డుతో ఎస్ఎస్ఆర్కే



అవార్డును అమ్మకు అంకితం ఇస్తున్న ఎస్ఎస్ఆర్కే



స్పీడ్ బ్రేకర్ ను పోలిన త్రీడీ పెయింటింగ్



త్రీడీ పెయింట్ వేస్తున్న ఎస్ఎస్ఆర్కే



తాను వేసిన త్రీడీ పెయింట్‌తో ఎస్ఎస్ఆర్కే

మంథని, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా మంథనికి చెందిన సింగారపు శివరామ కృష్ణ(ఎస్ఎస్ఆర్కే) త్రీడి పెయింటింగ్‌లో రాణిస్తున్నాడు. ఇంట్లో అమ్మ వేసిన ముగ్గులను చూసి ఆసక్తి పెంచుకున్న ఎస్ఎస్ఆర్కే తన తల్లిని స్ఫూర్తిగా తీసుకొని తొలుత కార్టూనిస్టుగా తర్వాత 3డీ ఆర్టిస్టుగా ఎదిగాడు. ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాల్లో 3డీ పెయింటర్‌గా గుర్తింపు పొందిన ఎస్ఎస్ఆర్కే గత ఏడాది ఆగస్టు నెలలో అమెరికాలో జరిగిన స్ట్రీట్ ఆర్ట్స్ ఫెస్టివల్‌లో ఎస్ఎస్ఆర్ అక్కడి రోడ్లపై వేసిన 3డీ ఆర్ట్ చూసి అమెరికన్స్ అతడిని ప్రశంసల్లో ముంచెత్తారు. పదేళ్లుగా వివిధ రకాల త్రీడీ పెయింటింగ్స్ వేస్తూ దేశ, విదేశాల్లో రికార్డుల సొంతం చేసుకుంటున్నాడు.



ఆమెరికా వీధుల్లో అలరించిన 3డీఆర్ట్స్..

అమెరికాలోని డౌన్ టౌన్ మిన్నియా పాలిస్ నగరంలో గత ఏడాది ఆగస్టు నెలలో నిర్వహించిన స్ట్రీట్ ఆర్ట్స్ ఫెస్టివల్‌లో మంథనికి చెందిన త్రీడీ ఆర్టిస్టు ఎస్ఎస్ఆర్కే పాల్గొన్నాడు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను త్రీడీలో అమెరికా వీధుల్లో చిత్రీకరించి, అక్కడి వాళ్లకి తెలంగాణ సంస్కృతి, ప్రత్యేకతను వివరించాడు. శివరామకృష్ణ గీసిన పలు త్రీడీ చిత్రాలను చూసి అమెరికా ప్రజలు ప్రశంసలు కురిపించారు. దాదాపు 40 మంది అంతర్జాతీయ ఆర్టిస్టులు పాల్గొన్న ఈ ఫెస్టివల్‌లో మన దేశం నుంచి ఎస్ఎస్ఆర్కే ఒక్కడే పాల్గొనడం విశేషం.





అమెరికాలో వేసిన త్రీడి పెయింటింగ్ తో ఎస్ఎస్ఆర్కే

సామాజిక అంశాలే లక్ష్యంగా..

త్రీడీ ఆర్ట్స్ అనేది ఒక వినోదాత్మకమైన చిత్రకళ. అయినప్పటికీ దీన్ని సమాజ వికాసం కోసం ఉపయోగపడే విధంగా మలిచే ప్రయత్నంలో ఉన్నాడు ఎస్ఎస్ఆర్కే. ఇప్పటికే తన తల్లి సూచన మేరకు భూగర్భ జలాలు పెంచే విధంగా ప్రజల్లో అవగాహన తీసుకురావడం కోసం ఇంకుడు గుంతపై త్రీడీ పెయింటింగ్ వేశాడు. అలాగే పలు సామాజిక అంశాలపై అవగాహన పెంచేలా చిత్రాలు వేయడానికి ప్రయత్నాలు చేస్తున్నాడు. త్రీడీ ఆర్ట్స్‌లో ఆసక్తి ఉన్న చాలా మంది రాణించేలా వారికి చిట్కాలు నేర్పించడానికి పాఠశాలల, కళాశాలల విద్యార్థుల కోసం సమ్మర్, ప్రత్యేక కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలనే యోచనలో ఉన్నారు.

అవార్డులను చూసి అమ్మ మురిసిపోతుంది..

\- సింగారపు శివరామకృష్ణ, 3డీ ఆర్టిస్టు, మంథని

త్రీడీ పెయింటర్‌గా దేశ, విదేశాల్లో రాణిస్తున్న మా అమ్మ సింగారపు పోచమ్మనే నాకు ఆదిగురువు. నా విజయాల్లో ఆమె ప్రోత్సాహాన్ని మరువలేను.. దేశ, విదేశాల్లో నేను వేసిన పెయింటింగ్స్‌కు వస్తున్న అవార్డులను చూసి ఎంతో మురిసిపోతుంది మా అమ్మ. చిన్నప్పుడు రెండో తరగతిలో సామాన్య శాస్త్రంలోని 'మానవుడి జీర్ణవ్యవస్థ' పటాన్ని నాతో అమ్మ గీయించింది. తాను వేసిన ముగ్గులను మళ్లీ నాతో వేయించేది. అలా అమ్మ ఇచ్చిన ప్రోత్సాహం, నేర్పించిన కళ కారణంగా నాకు ఆర్ట్ మీద మమకారం పెరిగింది. త్రీడీ చిత్రాలు నేర్చుకునే టప్పుడు అవకాశాలు రాక నిరుత్సాహ పడ్డప్పుడు, ఆర్థిక ఇబ్బందులు, వ్యక్తిగత సమస్యలు ఎన్ని ఉన్నా ఈ కళను మాత్రం వదిలిపెట్టకని ధైర్యాన్ని నూరుపోసి అండగ నిలిచి అమ్మ. నా కష్టాల్లో పాలుపంచుకొని ధైర్యాన్నిచ్చిన మా అమ్మే నా విజయాలకు స్ఫూర్తి.

మాలల ఆత్మగౌరవం కోసం నిలబడి కొట్లాడుతా

● డిసెంబరు 1న సింహగర్జనను విజయవంతం చేయాలి ● చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి

● మాల మాలల ఉపకులాల ఆత్మగౌరవ ర్యాలీ, సభ

సిరిసిల్ల టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నాడు తెలంగాణ ఉద్యమంలో ముందుడి పోరాడిన, బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దెదించడానికి పోరాడిన.. ప్రస్తుతం మాలల ఆత్మగౌరవం కోసం నిలబడి కొట్లాడుతానని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం లహరి పంక్షన్‌హాల్‌లో మాల మహానాడు జాతీయ కార్యదర్శి రాగుల రాములు అధ్యక్షతన మాల మాలల ఉపకులాల ఆత్మగౌరవ సభను నిర్వహించారు. అంతకు ముందు సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి గడ్డం వివేక్ వెంకటస్వామి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి పట్టణ ప్రధాన రహదారుల గుండా లహరి పంక్షన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. లహరి పంక్షన్ హాల్‌లో మాల మాలల ఉపకులాల ఆత్మగౌర సభలో ముఖ్య అతిథి వివేక్ వెంకటస్వామి మాట్లాడారు. రాజకీయ పార్టీలన్నీ మాలలను చిన్న చూపు చూస్తున్నాయని అన్నారు. మాలలు మౌనం వహిస్తున్నారని వారి ఉనికిని ప్రశ్నార్థకం చేస్తామంటే ఊరుకునే ప్రసక్తి లేదన్నారు. మాలలు ఎలాంటి పోరాటాలకైనా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ తీర్పు ఇచ్చిన చంద్రచూడ్ కులవివక్షత చూపారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో మాలలు దాదాపు 30 లక్షల మంది ఉన్నారని అన్నారు. మాలల హక్కుల సాధన కోసం మరో పోరాటం చేస్తామన్నారు. వివేక్ ఆస్తుల కోసమో, మంత్రి పదవి కోసమో మాలల వైపు ఉంటున్నారని కొందరు విమర్శలు చేస్తున్నారని వాటిని తాను పట్టించుకోవడం లేదని మాలల కోసం మాత్రమే ఉద్యమంలోకి దిగానని అన్నారు. రాష్ట్రంలోని మాలలు అంతా ఏకతాటిపైకి రావాలని ఐక్యత చాటుతూ హక్కుల సాధన కోసం ముందుండి నడవాల్సిన అవశ్యకత ఏర్పడిందన్నారు. మాలల శక్తిని చూపించడానికి డిసెంబరు 1న హైదరాబాద్‌లో తలపెట్టిన సింహగర్జనను మాలలు, మాలల ఉపకులాలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సుద్దాల దేవయ్య, రిటైర్డ్ డీఎస్పీ దామెర నర్సయ్య, నాయకులు రెంజర్ల రాజేష్, మాందాల భాస్కర్, కొరివి వేణుగోపాల్, గొట్టె రుక్మిణి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

ఎన్‌డీఏ సర్కారుది నిరంకుశ పాలన

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు టి.జ్యోతి

జ్యోతినగర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఎన్‌డీఏ సర్కారుది నిరంకుశ పాలన నడుస్తోందని, ప్రజల రాజ్యాంగ హక్కులను మోదీ ప్రభుత్వం హరిస్తున్నదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు టి.జ్యోతి అన్నారు. సీపీఎం జిల్లా మహాసభలలో భాగంగా ఎన్టీపీసీ మేడిపల్లి సెంటరులో జరిగిన బహిరంగ సభలో జ్యోతి ప్రసంగించారు. రెండు పర్యాయాలు అధికారంలో ఉన్న ఎన్‌డీఏ ప్రభుత్వం పేదల ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోలేదని, పెట్టుబడిదారుల పక్షాన నిలిచిందని ఆరోపించారు. సింగరేణిని కేంద్రం ప్రైవేటు పరం చేసే కుట్ర చేస్తున్నదని జ్యోతి తెలిపారు. సింగరేణి బొగ్గు బ్లాకులను వేలం వేస్తున్నదని, అది జరిగితే సింగరేణి మనుగడే ప్రశ్నార్థకమవుతుందన్నారు. సభలో సీపీఎం రాష్ట్ర కమిటీ నాయకులు భూపాల్, ఆశన్న, జిల్లా కార్యదర్శి వై.యాకయ్య తదితరులున్నారు.

బీ ఫార్మసీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

గణేశ్‌నగర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం ఎల్ఎండీ క్యాంపస్‌లో గల ఫార్మసీ కళాశాలలో బీ ఫార్మసీ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 26వ తేదీన తక్షణ ప్రవేశాలు (స్పాట్ అడ్మిషన్లు) నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా కే శ్రీశైలం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఉదయం 11 గంటల లోపు ఉజ్వల పార్కు సమీపం లోని ఫార్మసీ కళాశాలలో హాజరు కావాలన్నారు. ఇప్పటి వరకు ఎక్కడా అడ్మిషన్ తీసుకోని వారికి అవకాశం ఉంటుందని, అభ్యర్థులు ఇంటర్మీడియట్ వరకు టీసీ తో సహా అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఎప్ సెట్ ర్యాంకు కార్డు తీసుకుని హాజరు కావాలని సూచించారు. వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్ సైట్ టీటీటీ.ట్సుర్పిజ్పిస్సి.ఛి.జీ ను సందర్శించాలని సూచించారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

● రాజరాజేశ్వరస్వామిని దర్శించుకున్న హంపి పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్యస్వామి



హంపి పీఠాధిపతికి స్వాగతం పలుకుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ , అర్చకులు

వేములవాడ కల్చరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా నిత్యం సామూహిక కార్తీక దీపోత్సవం కార్యక్రమాన్ని చేపడుతున్నారు. శనివారం సాయంత్రం సామూహిక కార్తీక దీపోత్సవంలో భాగంగా మహిళలు పలు ఆకృతుల్లో కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. వేములవాడ రాజరాజేశ్వరస్వామిని హంపి పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్యస్వామి దర్శించుకున్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఆలయ ఈవో వినోద్‌రెడ్డిలు పాదపూజ నిర్వహించి ఆశీర్వచనాలు తీసుకున్నారు. రాజన్న ఆలయ అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డిచే భూమిపూజ చేసినచోట హంపి పీఠా ధిపతి పూజ నిర్వహించారు.

కొండగట్టులో పకడ్బందీగా హుండీల లెక్కింపు : ఈవో

మల్యాల : కొండగట్టు అంజనేయస్వామి దేవస్థానం పరిధిలో గురువారం చేపట్టిన హుండీల లెక్కింపులో ఎలాంటి తప్పిదాలు, నిర్లక్ష్యంగాని లేదని పకడ్బందీగానే నిర్వహించినట్లు ఈవో ఎం. రామకృష్ణారావు స్పష్టం చేశారు. ఆంధ్రజ్యోతిలో శనివారం 'అంజన్న హుండీల లెక్కింపులో నిర్లక్ష్యం' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో ఈవో ఒక ప్రకటన జారీ చేశారు. దేవాదాయశాఖ సహాయ కమిషనర్ సుప్రియ, పోలీసులు, దేవస్థానం, బ్యాంకు అధికారులు, లలిత సేవా ట్రస్ట్ సమక్షంలో నాలుగు లాట్లలో లెక్కించడం జరిగిందని ప్రకటనలో పేర్కొన్నారు. హుండీల లెక్కింపు అనంతరం ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేశామని, లెక్కింపులో డబ్బులు, వస్తువులు చేతులు మారే అవకాశమే లేదని తెలిపారు. అయితే నోట్ల లెక్కింపు సందర్భంగా నోట్లు అతుక్కొని ఉండడం వల్ల ఒకటి, రెండు హెచ్చుగా వచ్చినట్లు గుర్తించి వాటిని సరిచేశామని వివరించారు. గురువారం నాటి లెక్కింపులో నోట్లు ఎక్కువ రావడం, ఆలయ సిబ్బంది ఒకరు వస్తువులను ఉంచుకోవడం జరుగలేదని, హుండీల మూటలలోని వస్తువులను తీసుకెళ్లి డబ్బాలో వేస్తారని దానిపై అనుమానాల ప్రచారం సత్యదూరమని ఈవో పేర్కొన్నారు.

ఎండోమెంట్ సీఈ పూజలు

దేవాదాయశాఖ ఇన్‌చార్జి చీఫ్ ఇంజనీర్ కనకరత్నం కొండగట్టు ఆంజనేయస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిం చగా అర్చకులు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. వారిని ఏఈవో అంజయ్య శాలువాతో సత్కరించారు.

ధర్మపురి క్షేత్రంలో కార్తీక పూజలు



కార్తీక మాసం సందర్భంగా ధర్మపురి వద్ద గోదావరి హారతి, పూజలు

ధర్మపురి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శనివారం కార్తీక భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. దీంతో శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి, అనుబంధ ఆలయాలు భక్తులతో కిట కిటలాడాయి. భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, నరసింహ హోమం, స్వామి వారల నిత్య కళ్యాణం జరిపించి పూజలు చేశారు. ఆలయం ఆవరణలో గల ఉసిరిక చెట్టు చుట్టు ప్రదక్షిణాలు చేసి కార్తీక దామోదరుడిని పూజించారు. యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. ధర్మపురి క్షేత్రంలో 22 వ రోజు శనివారం గోదావరి హారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రాత్రి వరకు గోదావరి మాతకు హారతి ఇచ్చి భక్తి శ్రద్దలతో పూజలు చేసి నదిలో దీపాలు వదిలి పుణ్యప్రాప్తి పొందారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ క్రీడా పోటీల షెడ్యూల్ విడుదల

● సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో క్రీడా పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు నిర్వహించనున్న సీఎం కప్ క్రీడా పోటీల షెడ్యూల్‌ను ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీ విడుదల చేశారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాలలో పోటీలను నిర్వహించనున్నారు. సీఎంకప్ క్రీడా పోటీలను గ్రామస్థాయిలో రెండు రోజులు, మండల స్థాయిలో మూడు రోజులపాటు, జిల్లాస్థాయిలో ఆరు రోజులపాటు, రాష్ట్రస్థాయిలో ఏడు రోజుల పాటు నిర్వహిస్తారు. ఆయా జిల్లా కలెక్టర్లు ప్రకటించిన తేదీలలో కొంతమేరకు మార్పులు చేర్పులు చేసుకునేందుకు వెసులుబాటును కల్పించారు. అలాగే జిల్లా కలెక్టర్ ఆ ప్రాంతంలో గల ప్రాధాన్యతగల క్రీడను కూడా ఎంపిక చేసిన పోటీలు నిర్వహించేందుకు ఈ షెడ్యూల్‌లో అవకాశం కల్పించారు.

● క్రీడా షెడ్యూల్ ఇలా..

● గ్రామస్థాయిలో ఈ క్రీడలను డిసెంబరు 7,8 తేదీల్లో నిర్వహించాలని నిర్ణయించారు. మండల స్థాయిలో డిసెంబర్ 10, 11, 12 తేదీల్లో నిర్వహించాలని పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో డిసెంబర్ 16వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ఆరు రోజుల పాటు ఈ పోటీలను నిర్వహిస్తారు. రాష్ట్రస్థాయిలో పోటీలను డిసెంబర్ 27 నుంచి జనవరి 2వ తేదీ వరకు నిర్వహించనున్నారు. మొదటగా గ్రామ పంచాయతీ, మండల స్థాయిలో ఏడు క్రీడాంశాల్లో పోటీలను నిర్వహించనున్నారు. అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో, యోగాలతోపాటు ఏడవ క్రీడాంశంగా కలెక్టర్ ఏదేని ప్రాధాన్యతగల క్రీడను నిర్ణయిస్తారు.

● జిల్లాస్థాయిలో అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, స్విమ్మింగ్, రెజ్లింగ్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో, యోగా, చెస్, బేస్‌బాల్, నెట్‌బాల్, కిక్ బాక్సింగ్, సైక్లింగ్, ఉషు, జూడో, బిలియర్డ్స్ స్నూకర్‌లతోపాటు ఆ ప్రాంతాలల్లో ప్రాధాన్యం గల క్రీడను కలెక్టర్ ఎంపిక చేస్తారు. మొత్తం 21 క్రీడాంశాలలో పోటీలను నిర్వహిస్తారు. రాష్ట్రస్థాయిలో మొత్తం 36 అంశాల్లో పోటీలను ఏడు రోజుల పాటు నిర్వహించనున్నారు. జిల్లాస్థాయిలో నిర్వహించే క్రీడలతో పాటు ఆర్చరీ, టేబుల్ టెన్నిస్, లాన్ టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్, జిమ్నాస్టిక్స్, షూటింగ్ హాకీ, సెపక్‌తక్రా, కరాటే, రోయింగ్, స్క్వాష్, ఆథ్యాపత్య, సాఫ్ట్‌బాల్, పవర్ లిఫ్టింగ్, తైక్వాండో, తదితర క్రీడాంశాల్లో పోటీలను బాల బాలికలకు, మహిళలు, పురుషులకు నిర్వహించనున్నారు. జిల్లా స్థాయిలో ఈ క్రీడా పోటీల నిర్వహణకు ఆరు లక్షల రూపాయల బడ్జెట్‌ను కేటాయించారు.

● విజేతలకు నగదు పురస్కారాలు

ఈ పోటీల్లో వ్యక్తిగత విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచిన క్రీడాకారులకు బంగారు పతకంతో పాటు 20 వేల నగదు పురస్కారాన్ని, ద్వితీయ స్థానంలో నిలిచిన క్రీడాకారులకు రజత పతకంతోపాటు 15 వేల రూపాయల నగదు పురస్కారాన్ని, అలాగే తృతీయ స్థానంలో నిలిచిన క్రీడాకారులకు కాంస్య పతకంతోపాటు 10 వేల రూపాయల నగదు పురస్కారాన్ని అందించనున్నారు. అలాగే టీం విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు లక్ష రూపాయల నగదు పురస్కారాన్ని, ద్వితీయ స్థానంలో నిలిచే జట్టుకు 75 వేల రూపాయల నగదు పురస్కారాన్ని, తృతీయ స్థానంలో నిలిచే జట్టుకు 50 వేల రూపాయల నగదు పురస్కారం ప్రభుత్వం అందిస్తుంది.

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన మనోజ్ఞనను అభినందిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష



రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పెద్దపల్లి కల్చరల్/ధర్మారం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వచ్చేనెల 6 నుంచి 10 వరకు జమ్మూ కాశ్మీర్‌లో జరగబోయే జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన ధర్మారం ఆదర్శ పాఠశాల విద్యార్థిని మనోజ్ఞనను కలెక్టర్ కోయ శ్రీహర్ష అభినందించారు. మనోజ్ఞకు స్పోర్ట్స్ కిట్ అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఈరవేణి రాజ్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు బైకని కొమురయ్య, మేకల సంజీవరావు పాల్గొన్నారు.

ధర్మారం: ధర్మారం ఆదర్శ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఈరవేణి రాజుకుమార్ తెలిపారు. ఈ నెల 25 నుంచి 27 వరకు మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో జరిగే రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ 19 పోటీలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న బి.శరణ్య, జి. అశ్విత, టి.హేమలత, జి.పూజ, సుష్మిత పాల్గొననున్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, ఈరవేణి రాజ్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు బైకని కొమురయ్య, మేకల సంజీవరావు ఉపాధ్యాయులు అభినందించారు.

న్యూస్ బాక్స్

నేడు ధర్మారంలో మంత్రి పర్యటన

ధర్మారం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) నేడు ధర్మారం మండలంలో మంత్రి శ్రీధర్ బాబుతోపాటు ఎంపీ వంశీకృష్ణ, పర్యటిస్తారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి తెలిపారు. పత్తిపాక గ్రామంలోని రిజర్వాయర్ స్థల పరిశీలనకు మంత్రి, ఎంపీ, ప్రభుత్వవిప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కాన్‌సింగ్ పాల్గొంటారని తెలిపారు.

తోటి విద్యార్థినికి ఆర్థికసహాయం

ఓదెల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 2004-05లో పదో తరగతి చదివిన తోటి విద్యార్థిని సౌజన్య ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని గుర్తించిన విద్యార్థులు ఆర్థిక సహాయం అందజేశారు. శనివారం ఆమె కూతురు పేరు మీద రూ.50వేలను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి శనివారం బాండ్‌ను అందించారు.

ప్రభుత్వ భూమిలో బోర్డు ఏర్పాటు

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పందిళ్ల గ్రామంలో గతంలో తహసీల్దార్ కుమార్ అనే వ్యక్తికి అక్రమంగా పట్టా చేసిన నాలుగు ఎకరాల 20గుంటల భూమిని పట్టా రద్దుచేసి ప్రభుత్వ భూమిగా బోర్డు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ ఎండి.వకీల్ తెలిపారు.

దుస్తులు అందజేత

జూలపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలోని వాలీబాల్ క్రీడాకారులకు శనివారం మాజీ ఉపసర్పంచ్ కొప్పుల మహేష్ తదితరులు క్రీడాదుస్తులను అందజేశారు. నాయకులు గుడిపాటి సంతోష్‌రెడ్డి, మెరుగు రమేష్, రాజు, వెంకటేష్, అజయ్, సాయి, వేణు, సలీం పాల్గొన్నారు.

ఎంపీపీ కార్యాలయ సందర్శన

పాలకుర్తి, 23 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని శనివారం డీపీవో వీరబుచ్చయ్య, జడ్పీ సీఈవో నరేంద్రలు వేర్వేరుగా సందర్శించారు. ఇంటింటి కుటుంబ సర్వేను పర్యవేక్షించి, ఈ నెల 29 వరకు పూర్తిచేయాలని సూచించారు. సర్వే వివరాలను ఎంపీడీవోలు పొల్సాని శశికళ, ఉప్పు సుదర్శన్‌లు వివరించారు.

సర్వే వివరాల నమోదు ప్రారంభం

జూలపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించే ప్రక్రియను శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పద్మజ, ఎంపీవో అనిల్ రెడ్డిలు చేపట్టారు. తప్పులు దొర్లకుండా ఆపరేటర్లు వ్యవహరించాలని సూచించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

మంథని, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : మండలంలోని లక్కెపూర్, గుమ్మునూరు, గాజులపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంథని పీఏసీఎస్ ఛైర్మన్ కొత్త శ్రీనివాస్, డైరెక్టర్లు శనివారం ప్రారంభించారు. మంథని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి, నేతలు ఐలి ప్రసాద్, ముస్కుల సురేందర్‌రెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్ల పరిశీలన

పాలకుర్తి,నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : మండలం పరిధిలోని ఈసాలతక్కళ్లపల్లి, కొత్తపల్లి, బసంత్‌నగర్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం మండల వ్యవసాయాధికారి బండి ప్రమోద్ కుమార్ పరిశీలించి కొనుగోళ్ల తీరును అడిగితెలుసుకున్నారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను టాబ్‌లో నమోదు చేయాలని సూచించారు.

నర్సింగ్ అధికారి పరీక్ష

రామగిరి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో శనివారం జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో నర్సింగ్ అధికారి పరీక్షను నిర్వహించారు. ఉదయం జరిగిన పరీక్షలో 150మందికి 9 మంది, మధ్యాహ్నం జరిగిన పరీక్షలో 150 మందికి ఇద్దరు గైర్హాజరయ్యారు.

పకడ్బందీ ప్రణాళికతో రామగుండం అభివృద్ధికి అడుగులు

- నగరంలో రూ.280కోట్లతో పనులు.. - గ్రామీణ ప్రాంతాల్లో రూ.20కోట్లతో రోడ్లు, డ్రైన్లు.. - ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, నవంబరు 23: రామగుండం అభివృద్ధికి పకడ్బందీ ప్రణాళికతోనే అడుగులు వేస్తున్నామని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రామగుండంలో నాలుగు నెలలుగా అసలు పని మొదలు పెట్టామన్నారు. నియోజకవర్గంలో రామగుండం నగరంతో పాటు పాలకుర్తి, అంతర్గాం మండలాలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికబద్ధంగా నిధులు తీసుకువస్తున్నామన్నారు. రామగుండం నగరంలో రూ.280కోట్ల టీయూఎఫ్ఐడీసీ, అమృత్, సీఎం స్పెషల్ గ్రాంట్, డీఎంఎఫ్‌టీ నిధులతో పనులు మొదలయ్యాయన్నారు. గ్రామాల్లో రోడ్లు, డ్రైన్లకు రూ.15కోట్ల సీఆర్ఆర్ నిధులు, రూ.5కోట్ల ఎంఆర్ఆర్ నిధులు మంజూరయ్యాయన్నారు. ఒక్కో మండలానికి రూ.10కోట్లు కేటాయించనున్నట్టు ఆయన తెలిపారు. బండలవాగు ప్రాజెక్టు పనులు గతంలో మొదలుపెట్టారని, ఇద్దరు ఎమ్మెల్యేలు మారినా పూర్తికాలేదన్నారు. కాంట్రాక్టర్లు కూడా పారిపోయారని, తాను భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్‌రెడ్డిలపై తాను ఒత్తిడి తెచ్చి కాంట్రాక్టర్లకు బిల్లులు ఇప్పించడంతో పాటు కొత్త నిధులు ఇప్పించామన్నారు. రెండు నెలల్లో పనులు పూర్తయ్యేలా ఒత్తిడి తెస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. అలాగే రూ.22కోట్లతో ఆర్అండ్ఆర్ సమస్య కూడా పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టామన్నారు. రామగుండంలో సింగరేణి నిధులతో మెడికల్ కళాశాల నిర్మాణం జరిగితే రూ.280కోట్లు విడుదల అయినా పనులు పూర్తి కాలేదని, సింగరేణి కూడా మళ్లీ నిధులు ఇచ్చేందుకు ముందుకు రాలేదన్నారు. తాను ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి సింగరేణితో రూ.140కోట్లు ఇప్పించి హాస్పిటల్ నిర్మాణాన్ని ప్రారంభించామన్నారు. మెడికల్ కళాశాలకు అనుబంధంగా డెంటల్, నర్సింగ్ కళాశాలలు, పీజీ కోర్సులు మంజూరు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరగా రూ.26కోట్లతో నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు జీఓ ఇచ్చారని, డెంటల్ కళాశాల ప్రతిపాదనలు కూడా ఢిల్లీకి వెళ్లాయన్నారు. రామగుండం పై ఓవర్ కుడివైపు రైట్ ఆర్మ్ నిర్మాణానికి రూ.10కోట్లతో ప్రతిపాదనలు చేశామని, మరో రూ.60 కోట్లు ఆర్అండ్ బీ రహదారులు, మరో రూ.350కోట్లతో పాలకుర్తి లిఫ్ట్‌కు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. రామగుండంలో బసంత్‌నగర్‌లో ఎయిర్ పోర్టు వయబుల్ కాదని గతంలో నివేదిక ఇచ్చారని, కొత్తగా 500 నుంచి 600ఎకరాల్లో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ప్రయత్నిస్తున్నామని, కలెక్టర్ ఆధ్వర్యంలో స్థలాల పరిశీలన జరుగుతుందన్నారు. రామగుండం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు వల్ల ఈ ప్రాంత కార్మికులకు ప్రయోజనం కలుగనున్నదని, పేరు మార్పుపై తర్జనభర్జన జరుగుతుందన్నారు. రామగుండంలో అభివృద్ధికి అడుగులు పడుతుంటే మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో పాటు కొందరు నాయకులు రాద్ధాంతం చేస్తున్నారని, మండిపడ్డారు. గతంలో విభజన బిల్లులో ఎన్‌టీపీసీలో 4వేల మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టు మంజూరైతే తమకు వద్దని అప్పటి ప్రభుత్వాలు చెప్పాయని, తాము పట్టుబట్టి 800 మెగావాట్ల విద్యుత్ కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వంలో పీపీఏ ఇప్పించి యూనిట్ల స్థాపనకు మార్గం సుగమమం చేశామన్నారు. తక్కువ కాలుష్యం ఉండేలా సూపర్ క్రిటికల్ పవర్ స్టేషన్ నిర్మాణం జరుగనున్నదని, దీని వల్ల ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందన్నారు. రామగుండంలో విద్యుత్ కేంద్రం, ఓపెన్‌కాస్టులో 500మెగావాట్ల మరో విద్యుత్ కేంద్రం ఏర్పాటు కానున్నాయని, రామగుండం, మంథనికి కనెక్టివిటీ పెంచేందుకు గోదావరిఖని నుంచి జేఎన్‌టీయూ వరకు రూ.14కోట్లతో ఫోర్ లైన్ రోడ్డు నిర్మించనున్నామని, పాత రోడ్డును కూడా పునరుద్ధరించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. విలేకరుల సమావేశంలో మేయర్ బంగి అనీల్ కుమార్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కళ్యాణ్‌నగర్, నవంబరు 23 (ఆంధ్యజ్యోతి): మహిళా అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 235మంది లబ్ధిదారులకు రూ.2.38 కోట్ల కళ్యాణలక్ష్మి, షాదీముబాకర్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ బంగి అనీల్ కుమార్, తహసీల్దార్ కుమారస్వామి, కార్పొరేటర్లు బొంతల రాజేష్, మహంకాళి స్వామి, ఎండీ ముస్తాఫా, శంకర్ నాయక్, పెద్దెల్లి తేజస్విని ప్రకాష్, ధరణి స్వరూప, బాల రాజ్‌కుమార్, నాయకులు కాల్వ లింగస్వామి, తిప్పారపు శ్రీనివాస్, పాతిపెల్లి ఎల్లయ్య, మారెల్లి రాజిరెడ్డి, దాసరి సాంబమూర్తి, ఉమ, చుక్కల శ్రీనివాస్, బొమ్మక రాజేష్, యుగంధర్ పాల్గొన్నారు.

జన గణనలో కులగణన చేయాలి..

పెద్దపల్లిటౌన్, నవంబరు 23 (ఆంధ్యజ్యోతి) : జనగణనలో కులగణన చేపట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా ఇంచార్జి ఆది మల్లేశం, జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి మనోజ్ గౌడ్ డిమాండ్ చేశారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో శనివారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, ఇందుకు రాజ్యాంగ సవరణ చేయాలని కోరారు. ఈనెల 25న హైదారాబాద్ రవీంద్రభారతిలో జరగనున్న బీసీల సమరభేరి పోస్టర్లు ఆవిష్కరించారు. రాష్ట్ర కార్యదర్శి తాడూరి శ్రీమాన్, మహిళ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సరోజ సత్యనారాయణ, జిల్లా యువజన సంఘం అధ్యక్షులు నోమూరి శ్రీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సమాజ అభివృద్ధికి కృషి చేయాలి

పెద్దపల్లిటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలను విడనాడి సమాజ అభివృద్ధి యువత కృషిచేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర పిలుపునిచ్చారు. సీపీఐ శతజయంతి వార్షికోత్సవాలను పురస్కరించుకుని ఏఐవైఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. సదస్సులో జిల్లా అధ్యక్షుడు మానస్ కుమార్, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం ముఖ్య నేతలుగా పాల్గొన్నారు.

ఖనిలో బీజేపీ నాయకుల సంబరాలు



స్వీట్లు తినిపించుకుంటున్న బీజేపీ నాయకులు

కళ్యాణ్‌నగర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో బీజేపీ అఖండ విజయం సాధించడంపై శనివారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి, రాష్ట్ర నాయకులు మేరుగు హన్మంతుగౌడ్ ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహారాష్ట్రలో బీజేపీ గెలుపు ప్రజల విశ్వాసానికి నిదర్శనమని, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో పెరిగిన అభివృద్ధి ఫలితంగానే మహారాష్ట్రలో భారీ మెజార్టీ సాధించడం జరిగిందన్నారు. ఈ విజయం ప్రతి ఒక్క కార్యకర్తదని చెప్పారు. రాబోయే రోజుల్లో కూడా తెలంగాణలో కాషాయం జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పిడుగు కృష్ణ, జనగామ భూమయ్య, కోడూరి రమేష్, కోమళ్ల మహేష్, క్యాతం వెంకటరమణ, తడగొండ నర్సయ్య, మామిడి వీరేశ్, మచ్చ విశ్వాస్ పాల్గొన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రావుల రాజేందర్ ఆధ్వర్యంలో చౌరస్తాలో బాణాసంచా కాల్చి మిఠాయిలను పంపిణీ చేశారు. బీజేపీ మహారాష్ట్రలో భారీ విజయం సాధించిందని, రాబోయే ఎన్నికల్లో కూడా దేశంలో బీజేపీ అఖండ విజయం సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మామిడి రాజేష్, గాలిపెల్లి తిరుపతి, సంపత్, వేణు, వట్లూరి రాము పాల్గొన్నారు. బీజేపీ మహిళా మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సోమారపు లావణ్య ఆధ్వర్యంలో చౌరస్తాలో బాణాసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సోమారపు అరుణ్, సునీల్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

సుల్తానాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇస్రోమేజికా స్పేస్‌టెక్ వారు నిర్వహించిన ఇస్రో స్పేస్ మిషన్ వర్క్ షాపులో జూనియర్ సైంటిస్టు ప్రోగ్రాంలో సుల్తానాబాద్ మండలంలోని సుద్దాల ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని ఆనన్య తన ప్రతిభను చాటుకుంది. శనివారం ఇస్రో స్పేస్ మిషన్ వర్క్‌షాప్‌లో నిర్వహించిన జూనియర్ సైంటిస్ట్ ప్రోగ్రాం వివరాలను హెచ్ఎం కోటేశ్వర్‌రావుకు పంపించారు. ఎనిమిదవ తరగతి విద్యార్థిని అనన్య చూపిన ప్రతిభను సుల్తానాబాద్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మినుపాల ప్రకాష్‌రావు, హెచ్ఎం కోటేశ్వర్‌రావు తదితరులు సుద్దాలలో ప్రశంసిస్తూ సన్మానించారు. అలాగే ఇటీవల హైదరాబాద్‌లో తెలంగాణ సంగీత నాటక సాహిత్య అకాడమి వారు నిర్వహించిన పోటీలలో కూడా సుద్దాల పాఠశాలకు చెందిన ఎనిమిదవ తరగతి విద్యార్థులు అనుదీప్తి, ఆనన్య, అవంతిక, శ్రీవర్షిణి, అనన్య, మహితలకు తృతీయ బహుమతులు లభించాయి. వ్యాస రచన పోటీలలో అనుదీప్తికి తృతీయ, గానంలో ఎం అనన్యకు తృతీయ బహుమతులు వచ్చాయి. వీరిని కూడా ప్రకాష్ రావు తదితరులు సన్మానించారు.

పత్తిపాక రిజర్వాయర్‌కు మోక్షం..

(5వ పేజీ తరువాయి)

విడుదల చేస్తూ ఉంటారు. కాల్వ చివరి భూములైన ఓదెల, కాల్వశ్రీరాంపూర్, ముత్తారం, రామగిరి, మంథని, రామగుండం మండలాల్లోని చివరి ఆయకట్టు భూములకు సక్రమంగా నీరందక పంటలు ఎండిపోతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు నీటిని జిల్లాలోని ఎస్సారెస్పీ ఆయకట్టు భూములకు అందించి స్థిరీకరణ చేసేందుకు ధర్మారం మండలం పత్తిపాక వద్ద ఒక రిజర్వాయర్‌ను నిర్మించాలని ప్రతిపాదించారు. ఐదు టీఎంసీలు లేదా పది టీఎంసీల సామర్థ్యంతో చేపట్టాలని భావించారు. మొదట 1.56 టీఎంసీల సామర్థ్యంతో ఒక ప్రతిపాదన,ఏడు టీఎంసీల సామర్థ్యంతో మరొక ప్రతిపాదనను నీటిపారుదల శాఖ అధికారులు రూపొందించారు. కానీ ప్రభుత్వం పత్తిపాక రిజర్వాయర్‌ను చేపట్టేందుకు ముందుకు రాలేదు. దీనికి ప్రత్యామ్నాయంగా వరద కాలువ నుంచి ఎస్సారెస్పీ కాలువకు మధ్య మూడు కిలోమీటర్ల వరకు కాలువను నిర్మించారు. దీని ద్వారా రైతులకు శాశ్వత పరిష్కారం లభించడంలేదు. గాయత్రి పంప్‌హౌస్ నుంచి వరద కాలువ ద్వారా మిడ్ మానేరుకు నీటిని తరలించినప్పుడు మాత్రమే లింకు కాలువ ద్వారా సాగునీరు అందనున్నది. అయితే ఇది తాత్కాలికమే. శాశ్వత పరిష్కారం రైతులకు లభించాలంటే పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణం చేపట్టాల్సిందే.

ఖనిలో షీటీమ్‌పై అవగాహన సదస్సు

కోల్‌సిటీటౌన్, నవంబర్ 23(ఆంధ్రజ్యోతి): మదర్ హ్యూమన్ యూత్ సొసైటీ, భరోసా సెంటర్, ఏఎస్ఐ మల్లన్న సంయుక్త ఆధ్వర్యంలో శనివారం గోదావరిఖని మార్కండయకాలనీలోని భాను మల్టీమీడియా ఇన్‌స్టూట్, ప్రభుత్వ పాఠశాలలో షీటీమ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భరోసా సెంటర్ కోఆర్డినేటర్ ఆశ్రిత, మదర్ హ్యూమన్ యూత్ సొసైటీ ప్రెసిడెంట్ రాజ్‌కుమార్, ఆస్మా, ఇన్‌స్టూట్ నిర్వాహకులు, ప్రిన్సిపల్ ఇస్రాయిల్, భూమయ్య పాల్గొన్నారు.

మట్టి టిప్పర్‌లను అడ్డుకున్న రైతులు

పెద్దపల్లి రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొంపల్లిలో గుట్ట నుంచి మట్టిని తరలిస్తుండటంతో రోడ్డు పక్కనగల పంట పొలాలు నాశనం అవుతున్నాయని రైతులు శనివారం ఆందోళన చేపట్టారు.మట్టితో వెళ్తున్న టిప్పర్‌ను అడ్డుకున్నారు. రెవెన్యూ అధికారులు చేరుకోని సమస్యలు పరిశీలించి రైతులను అడిగి తెలుసుకున్నారు. కాగా, పెద్దపల్లి మండలంలోని తుర్కలమద్దికుంటలో శుక్రవారం రాత్రి అక్రమ మట్టిని తరలిస్తున్న జేసీబీ, ట్రాక్టర్‌ను సీజ్ చేసి పెద్దపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు పెద్దపల్లి మైనింగ్ ఏడి శ్రీనివాస్ తెలిపారు. వెంట రెవెన్యూ ఆర్ఐ భాను, సిబ్బంది షబ్బీర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సింగిల్‌విండో నిధుల దుర్వినియోగంపై మంత్రికి ఫిర్యాదు

సుల్తానాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్రెపల్లి సింగిల్ విండో లో నిదులు దుర్వినియోగం చేసిన సంఘటనపై చర్యలు తీసుకోవాలని కోరుతు బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ తంగళ్లపల్లి రాజ్‌కుమార్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కోరారు. ఈ మేరకు ఆయన శనివారం హైదరాబాద్‌లో మంత్రిని కలసి ఒక పిర్యాదు పత్రాన్ని అందజేశారు. సింగిల్ విండో కోసం భవనం నిర్మించేందుకు స్థలాన్ని కొనుగోలు చేసే ప్రక్రియలో రూ 39 లక్షలకు రికార్డులలో రూ 42 లక్షలుగా పేర్కొని డ్రా చేశారని ఇందులో ఐదు లక్షలు కాజేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

టీఎస్‌టీపీపీ ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకుంటాం

- ప్రభావిత గ్రామాల్లో బైక్ ర్యాలీ - బీఆర్ఎస్ నేతలు

జ్యోతినగర్, నవంబరు 23 :ఈనెల 29న తెలంగాణ ఎన్టీపీసీ(టిఎస్‌టిపిపి) ప్రాజెక్టు ప్రభాభిప్రాయ సేకరణను అడ్డుకుంటామని బీఆర్ఎస్ జ్యోతినగర్ అధ్యక్షుడు బుర్ర శంకర్‌గౌడ్, కార్పొరేటర్లు ఎన్.వి.రమణారెడ్డి, కుమ్మరి శ్రీనివాస్, కల్వచర్ల కృష్ణవేణి, అంజలి స్పష్టం చేశారు. శనివారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రామగుండం ప్రాజెక్టునిర్మాణం నుంచి ఎన్టీపీసీ చెబుతున్న అబద్ధాలను, ఉద్యోగ, ఉపాధి కల్పిస్తామని మభ్య పెడుతున్న వైనాన్ని ప్రభావిత ప్రాంతాల ప్రజలకు తెలియజేస్తామన్నారు. ఈనెల 27, 28లలో మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ నాయకత్వంలో ఆయాగ్రామాలలో బైక్ ర్యాలీ నిర్వహించి ప్రజలను చైతన్య పరుస్తామన్నారు. దేశానికి వెలుగులు అందిస్తుందనే తలంపుతో ఈ ప్రాంతంలోని 17 గ్రామాల ప్రజలు తమ భూములను త్యాగం చేశారని, నాలుగున్న దశాబ్ధాలు దాటతున్నప్పటికీ భూనిర్వాసితులకు సరైన న్యాయం చేయలేదన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, ప్రభావిత ప్రాంతాలలో అభివృద్ధి పనులు చేస్తామని చెప్పిన ఎన్టీపీసీ పూర్తిగావిఫలమైందని ఆరోపించారు. ఇంకా వందల మంది నిర్వాసితులు, వారి పిల్లలకి ఎన్టీపీసీ ఉపాధి కల్పించాల్సి ఉందని తెలిపారు. ఈ నాలుగున్నర దశాబ్ధాలతో ఎంత మంది భూనిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించారో పబ్లిక్ హియరింగ్‌కు ముందే ఎన్టీపీసీ నివేదికను ప్రకటించాలని డిమాండ్ చేశారు.పబ్లిక్ హియరింగ్ రోజు ప్రజల భాగస్వామ్యంతో బీఆర్ఎస్ శ్రేణులు ఎన్టీపీసీని నిలదీస్తామన్నారు. విలేకరుల సమావేశంలో కేవీ.చందు, ఒల్లాల మల్లేశం, నాయకులు పాల్గొన్నారు.

కూలీ రేట్లు పెంచాలంటూ హమాలీల ఆందోళన



నిరసన తెలుపుతున్న హమాలీ కార్మికులు

కళ్యాణ్‌నగర్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని కూరగాయల మార్కెట్‌లో హమాలీ కార్మికులు కూలీ పెంచమంటే పోలీసుల చేత అక్రమ కేసులు పెట్టించడాన్ని నిరసిస్తూ శనివారం గోదావరిఖని కూరగాయల మార్కెట్‌లో డీహెచ్‌పీఎస్ జిల్లా కన్వీనర్ మద్దెల దినేష్ ఆధ్వర్యంలో హమాలీ కార్మికులు ప్లకార్డులతో నిరసనకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోల్‌సేల్ వ్యాపారులు హమాలీలకు కూలీ రేట్లు పెంచకుండా వారిపై అక్రమంగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం, బూతులు తిట్టడాన్ని ఖండిస్తున్నట్టు చెప్పారు. హమాలీ కార్మికులు కూలీ రేట్లు పెంచాలని డిమాండ్ చేస్తుంటే వ్యాపారులు స్పందించకుండా మొండిగా వ్యవహరిస్తున్నారన్నారు. హమాలీ సంఘం జిల్లా కార్యదర్శి ఎంఏ గౌస్, కండె లక్ష్మయ్య, రాంచందర్, సతీష్, జానిమియా పాల్గొన్నారు.

విజయోత్సవాలు వాయిదా

మంథని, నవంబరు 23: ప్రజా ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం పూర్తి అవుతున్న నేపథ్యంలో ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాల కార్యక్రమాన్ని ఈనెల 24న కాకుండా 25వ తేదీన స్థానిక శివకిరణ్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసినట్లు జిల్లా ఇంచార్జి పౌర సంబంధాల అధికారి బీ. జగన్ ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు.

కుటుంబానికి పరామర్శ

రామగిరి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్లకు చెందిన సుద్దాల పద్మ గుండెపోటుతో మృతిచెందగా బాధిత కుటుంబ సభ్యులను శనివారం జడ్పీ మాజీ ఛైర్మన్ పుట్ట మధు పరామర్శించారు. మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ సత్యనారాయణగౌడ్, శంకేషి రవీందర్ తదితరులు ఉన్నారు.

నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యం



పొలం బాటలో పాల్గొన్న విద్యుత్ అధికారులు

ధర్మారం, నవంబర్ 23 (ఆంధ్రజ్యోతి) రైతుల పంట పొలాలకు నాణ్యమైన విద్యుత్ అందించమే విద్యుత్ శాఖ లక్ష్యమని, అందుకు రైతులు కూడా విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని సూపరింటెండింగ్ ఇంజనీర్ కంకటి మాధవరావు అన్నారు. శనివారం ధర్మారం మండలం రచ్చపల్లిలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలం అయన బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మట్లాడుతూ రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలంటే పొలాల వద్ద స్టాటర్లు, ఫ్యూజులు, స్టాటర్ బాక్సులు, మోటార్లకు కెపాసిటర్లు నాణ్యమైనవి వాడాలని సూచించారు. మోటర్లుకు కెపాసిటర్లు బిగించుకోవడం వల్ల లోఓల్టేజి సమస్య రాదని తెలిపారు. అక్రమంగా విద్యుత్ కంచెలు ఏర్పాటు చేయవద్దని హెచ్చరించారు. పొలం బాటలో డిఈ దాసరి తిరుపతి, డిఈ టెక్నికల్ బి.రవి, ఏడిఈ విజయ్ గోపాల్‌సింగ్, ఏఈ మహిపాల్ రెడ్డి, సెక్షన్ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.



ఆర్జీ-3, ఏపీఏ డివిజన్లలో పర్యటించిన సెక్యూరిటీ జీఎం



ఏర్పాట్లను సమీక్షిస్తున్న సెక్యూరిటీ జీఎం

రామగిరి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3, ఏపీఏ డివిజన్‌లలో కార్పోరేట్ సెక్యూరిటీ విభాగం జీఎం సీహెచ్ లక్ష్మినారయణ శనివారం పర్యటించారు. అడ్రియాల ఓసీపీ-1,2 చెక్‌పోస్టుల పరిశీలించారు. సెక్యూరిటీపరంగా తీసుకుంటున్న చర్యలపై ఆర్జీ-3 ఎస్ఓటూ జీఎం రఘుపతిని అడిగి తెలుసుకున్నారు. సింగరేణి ఆస్తుల పరిరక్షణలో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట అధికారులు నాగేశ్వర్‌రావు, వెంకటరమణ, అబ్దుల్ షబ్బీరుద్దీన్, సుదర్శనం, రాజారెడ్డి, చంద్రశేఖర్, శ్రీహరి, రాజేశం, మథిన్‌హుస్సేన్, లింగయ్య, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రెటరీగా రాజ్‌కుమార్

రామగిరి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రెటరీగా మడ్డి రాజ్‌కుమార్‌ను నియమిస్తు శనివారం వేజ్‌బోర్డు ఛైర్మన్ జనక్‌ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. తన నియమాకానికి కృషి చేసిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు, వేజ్‌బోర్డు ఛైర్మన్ జనక్‌ప్రసాద్‌లకు రాజ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. యూనియన్ బలోపేతానికి తన వంతుగా కృషి చేస్తానని పేర్కొన్నారు.

కార్మికుల పక్షాన నిలిచేది టీబీజీకేఎస్..



కార్మికులతో మాట్లాడుతున్న అయిలి శ్రీనివాస్

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఏపార్టీ అధికారంలో ఉన్నా కార్మికుల పక్షాన నిలిచే సంఘం టీబీజీకేఎస్ మాత్రమేనని యూనియన్ ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ అయిలి శ్రీనివాస్ అన్నారు. శనివారం వకీల్‌పల్లె గని కార్మికులను కలసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా అయిలి శ్రీనివాస్ మాట్లాడారు. గత ఏడాది 18 నెలల పాటు యాజమాన్య అవరాల నిమిత్తం సర్ఫేస్‌లో విధులు కేటాయించిన కార్మికులకు అండర్ గ్రౌండ్ అలవెన్స్‌లు కోత విధించడం వలన ఆర్థికంగా నష్టపోయినట్టు తెలిపారు. 190 మస్టర్లు పూర్తికాక బదిలీ వర్కర్లు జనరల్ మజ్దూర్‌లుగా ప్రమోషన్లకు అర్హత కోల్పోయే పరిస్థితి నెలకొన్నట్టు పేర్కొన్నారు. అనారోగ్య కారణాల రీత్యా సీనియర్ కార్మికులను యాజమాన్యం అవసరాల నిమిత్తం సర్ఫేస్ పనిలో కేటాయించిందని, అటువంటి వారిని కొందరు యూనియన్ నాయకులు ఇబ్బందులకు గురిచేయడం అనైతికమన్నారు. కార్మికుల పక్షాన నిలవాల్సిన నాయకులు కార్మికులను ఇబ్బందులకు గురిచేసే విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. సర్ఫేస్‌లో ఏర్పడిన టెక్నీషియన్ ఖాళీలను భర్తీ చేయాలని, మెడికల్ గ్రౌండ్స్ కింద ఖాళీగా ఉన్న జనరల్ మజ్దూర్ ఖాళీలను సీనియార్టీ కోటాలో భర్తీ చేయాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. వకీల్‌పల్లె గనిలో సమస్యల పరిష్కారం దిశగా గని అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంకటేష్, రాములు, తిరుపతి, శ్రీనివాస్, లెనిన్, రాజారాం, సురేందర్, శ్రీకాంత్, రంజిత్ పాల్గొన్నారు.

యూనియన్ బలోపేతం దిశగా కమిటీలు



నియామక పత్రాలను అందజేస్తున్న ధర్మపురి

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సింగరేణి వ్యాప్తంగా ఐఎన్‌టీయూసీని బలోపేతం చేసే దిశలో భాగంగా పిట్ కమిటీలు వేస్తున్నట్టు యూనియన్ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ ధర్మపురి పేర్కొన్నారు. శనివారం స్థానిక యూనియన్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆర్జీ-2 ఏరియాలోని గనులు, డిపార్ట్‌మెంట్ల కమిటీలను నియమించినట్టు తెలిపారు. కార్మికులకు అందుబాటులో ఉంటూ ఐఎన్‌టీయూసీ కమిటీ సభ్యులు వాటి పరిష్కారం దిశగా పనిచేయనున్నట్టు పేర్కొన్నారు. ఓసీపీ-3 పిట్ సెక్రెటరీగా ప్రసాద్, వీకేపీ, వర్క్‌షాప్, బేస్ వర్క్‌షాప్, సీహెచ్‌పీ, ఎస్అండ్‌డీ పిట్ సెక్రెటరీలుగా జగదీష్, వంగ సురేష్, కర్క శ్రీనివాస్, తిరుపతి, ఆరె శ్రీనివాస్, డ్రాగ్‌లైన్ సెక్షన్, స్టోర్స్ పిట్‌లు సెక్రెటరీగా సంపత్,పాషా, జీఎం ఆఫీస్ పిట్ సెక్రెటరీగా సందీప్, ఎస్అండ్‌పీసీ పిట్ సెక్రెటరీగా అరకాల శ్రీనివాస్, 7ఎల్ఈపీ గని పిట్‌సెక్రెటరీగా తాటి రాయముల్లులను నియమిస్తున్నట్టు తెలిపారు. పిట్‌సెక్రెటరీలకు నియామక పత్రాలను అందజేశారు. ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ సత్యనారాయణరెడ్డి, నాయకులు దాసు, శంకర్‌నాయక్, మార్కండేయ, దశరథం పాల్గొన్నారు.

26న నిరసన ప్రదర్శన

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 26న దేశవ్యాప్త నిరసనల్లో జిల్లాకు చెందిన కార్మికులు, ప్రజా సంఘాలు భాగస్వాములు కావాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బీ అశోక్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఇఫ్టూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 26న పెద్దపల్లి జిల్లా కేంద్రంలో తలపెట్టిన నిరసన కార్యక్రమానికి సింగరేణి కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు తరలిరావాలని కోరారు. కార్మిక వర్గం ఐక్యంగా ఉండి బీజేపీ వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈసమావేశంలో బుచ్చమ్మ, శారద, స్వామి, ప్రకాష్, రాజనర్సు, రజిత పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన..

గోదావరిఖని, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే సింగరేణి వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి వైవీరావు, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి చెప్పారు. శనివారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పది సంవత్సరాల నుంచి సింగరేణిలో స్ట్రక్చర్ సమావేశాలు జరుగలేదని, దీని వల్ల కార్మికులు అనేక సమస్యలు పరిష్కారం కాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. చట్టబద్ధంగా జరుగాల్సిన మైన్స్ కమిటీ, సేఫ్టీ కమిటీ, జీఎం కమిటీ, జేసీసీ, స్ట్రక్చర్ మీటింగ్‌లు నిర్వహించాలని సీఎండీకి లేఖలు రాయడం జరిగిందన్నారు. సింగరేణిలో ఈపీ ఆపరేటర్ల సమస్యలను పరిష్కరించాలని, కార్మికుల పెర్క్స్‌పై ఆదాయపన్ను యాజమాన్యమే అధికారులకు చెల్లించే విధంగా కార్మికులకు కూడా చెల్లించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.33వేల కోట్లు మొండి బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో నాయకులు రాంచందర్, రాజరత్నం, రవీందర్, రాంచందర్‌రెడ్డి, ప్రసాద్, ప్రభుదాస్, సత్యనారాయణ, తొడుపునూరి రమేష్ పాల్గొన్నారు.

రాజ్యాంగ ఆమోద దినోత్సవ సభలకు ఆహ్వానం

కోల్‌సిటీటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ ఆమోద దినోత్సవ సభలను ఈనెల 26 నుంచి డిసెంబర్ 6వరకు నిర్వహించనున్నందున సభలకు హాజరుకావాలని శనివారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌రాజ్‌ఠాకూర్, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు కోరారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ను వారు మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వానించారు. అలాగే తిలక్‌నగర్‌లో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌ను కలిసి సభలకు హాజరుకావాలని కోరారు. ఎస్‌సీ, ఎస్‌టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బొంకూరి మధు, జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్, కాంపెల్లి సతీష్, బొందయ్య, అశోక్, నవాబ్ పాల్గొన్నారు.